


మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 06 | పేజీలు : 66 | ఎడిటర్ : డా.దామా విజయ్ కుమార్ | బుధవారం 5 మార్చి 2025 | వెల : 2-00

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో

# టీడీపీ క్లీన్ స్వీప్



- అప్పుడు 3, ఇప్పుడు 2...
- 2023లో 3 గ్రాడ్యుయేట్ స్థానాలు కైవసం చేసుకున్న టీడీపీ
- తాజాగా మరో రెండు స్థానాల్లో గెలుపు
- మొత్తం 5 గ్రాడ్యుయేట్ స్థానాలు టీడీపీ ఖాతాలోకే!

స్వర్ణసాగరం అమరావతి

గత కొన్నేళ్లలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా టీడీపీ జోరు మామూలుగా ఉండడంలేదు. 2023లో మూడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగితే... మూడు స్థానాలు టీడీపీనే కైవసం చేసుకుంది. ఇప్పుడు, తాజాగా రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగితే ఆ రెండింటినీ కూడా టీడీపీనే చేజిక్కించుకుంది. దాంతో రాష్ట్రంలోని ఐదు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను సైకిల్ క్లీన్ స్వీప్ చేసింది. తాజాగా జరిగిన - మిగతా3లో

## వీసీల రాజీనామాలపై

# దుమారం

- మండలిలో లోకేష్ - బొత్స
- బెదిరించి రాజీనామాలు చేయించారన్న బొత్స
- వీసీల రాజీనామా లేఖల్లో
- 'బెదిరించినట్లు' అనే పదం లేదన్న లోకేశ్



స్వర్ణసాగరం అమరావతి

రాష్ట్రంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల రాజీనామాలపై మంత్రి లోకేష్,.మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణల మధ్య మంగళవారం శాసన మండలిలో వాడీవేడీ చర్చ జరిగింది. అనంతరం బొత్స సత్యనారాయణ అసెంబ్లీ బయట మీడియా పాయింట్‌లో వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీలతో కలిసి ఆయన మాట్లాడుతూ.. వీసీలతో బలవతంగా రాజీనామాలు చేయించారనే ఆరోపణలపై విచారణకు సిద్ధమంటూ సవాల్ చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధారాలు చూపగానే ఎందుకు వెనక్కివెళ్ళారో చెప్పాలని - మిగతా3లో



## విశ్వసనీయ భాగస్వామిగా భారత్

- 'మన దేశానికి ఈ పని చేయగల సత్తా ఉంది
- మీ అందరూ (పరిశ్రమ) సత్తా ఉన్నవారు, ఇది మనకు మహత్తర అవకాశం
- ప్రపంచం అంచనాలను కేవలం ఒక వీక్షకునిగా మన పరిశ్రమ చూడరాదని కోరుకుంటున్నా
- ప్రభుత్వం గడచిన పది సంవత్సరాలుగా పరిశ్రమతో కలసి పని చేస్తున్నది
- ప్రధాని నరేంద్ర మోడీ



## ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకంపనలు

- ట్రంప్ సుంకాల దెబ్బకు కుదేలయిన అమెరికా మార్కెట్లు
- ఇప్పటికే చైనా ఉత్పత్తులపై 10 శాతం ప్రతీకార సుంకాలు విధించిన ట్రంప్ తాజాగా 20 శాతానికి పెంచడం తెలిసిందే.
- ఫెంటనిల్ డ్రగ్స్ అక్రమ రవానాను అడ్డుకోవడంలో బీజింగ్ విఫలమవడం వల్లే ఈ నిర్ణయం

# వైసీపీ హానీకరం

**పేదవాడి బువ్వ లాక్కున్నందుకు 11 స్థానాలే వచ్చాయి: పయ్యావుల కేశవ్**

- సభలో పయ్యావుల సీరియస్ కామెంట్స్
- వైసీపీ ఎమ్మెల్యేలపై పయ్యావుల కేశవ్ విమర్శలు
- అసెంబ్లీకి రాకుండా బయట ఉండి విమర్శలు గుప్పిస్తున్నారని మండిపాటు
- గత లోపాలను ఎత్తి చూపుతారనే ముఖం చాటేస్తున్నారని విమర్శ



స్వర్ణసాగరం అమరావతి

వైసీపీ ఎమ్మెల్యేలపై ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శలు గుప్పించారు. అసెంబ్లీకి రాకుండా బయట ఉండి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారని విమర్శించారు. ఉన్నవి లేనివి కల్పించి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీకి వస్తే గత లోపాలను ఎత్తి చూపుతారనే ముఖం చాటేస్తున్నారని అన్నారు. చేసిన పాపాలు వెంటాడటం వల్లే అసెంబ్లీ రాలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ ఆర్థిక విధ్వంసం సృష్టించిందని పయ్యావుల అన్నారు. ఆనాడు ప్రతిపక్షాల గొంతు నొక్కడం పైనే దృష్టి సారించారని విమర్శించారు. పేదవాడి బువ్వ లాక్కున్నందుకు 11 స్థానాలకే పరిమితమయ్యారని అన్నారు. బడ్జెట్ లో వెలిగొండ ప్రాజెక్ట్ కు నిధులు కేటాయించలేదని అంటున్నారని... ప్రాజెక్ట్ పూర్తయిందని, జాతికి అంకితం చేశామని వైసీపీ హయాంలో చెప్పుకున్నారని గుర్తు చేశారు. పూర్తయిన ప్రాజెక్ట్ కు కేటాయింపులు ఎలా చేస్తారని ఎద్దేవా చేశారు. వైసీపీపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో సంచలన కామెంట్లు చేశారు. బడ్జెట్‌పై రిప్లై ప్రారంభించిన మంత్రి.. - మిగతా3లో



## పోసానిపై 20కు పైగా కేసులు

- స్టేషన్స్ టూర్ లో కృష్ణమురళి
- పోసానిపై మరో కేసు నమోదు!

స్వర్ణసాగరం విజయవాడ

సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పోలీసులు కేసు నమోదయ్యాయి. నరసరావుపేట, బాపట్ల, అనంతపురం, శ్రీకుకుళం, విజయవాడ వంటి చోట్ల కేసులు నమోదయ్యాయి. దాదాపు 30కి పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి. అయితే ఇందులో పథ్నాలుగు కేసులు నమోదయినట్లు చెబుతున్నారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకూ పోసాని కృష్ణమురళిపై వరస కేసులు నమోదు కావడంతో ఆయన ఇప్పట్లో బయటకు వచ్చే అవకాశం లేదంటున్నారు. ఒకదాని తర్వాత మరొక కేసు పోసాని మెడకు చుట్టుకుంటుంది.గత వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పోసాని కృష్ణమురళి చేసిన కామెంట్స్ - మిగతా3లో



## పనిప్రదేశాల్లో పాలివ్వడాన్ని అవమానంగా చూడొద్దు

- మహిళల గౌరవానికి భంగం కలిగించే పద్ధతులను త్యజించాలని స్పష్టం
- పాలిచ్చే తల్లులుకు తమ బిడ్డ సంరక్షణలో అది భాగమని, దాన్ని అందరూ గౌరవించాలి
- అది వారి హక్కు కూడా కాబట్టి బహిరంగ ప్రదేశాల్లో, పనిప్రదేశాల్లో తల్లి బిడ్డకు పాలివ్వడాన్ని తప్పుపట్టొద్దు

## మార్చి నెలలోనే

# డీఎస్సీ నోటిఫికేషన్

- వైసీపీ హయాంలో ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదని విమర్శ
- టీడీపీ పాలనలోనే 70 శాతం ఉపాధ్యాయ నియామకాలు అన్న లోకేశ్
- వర్గీకరణపై త్వరలోనే వన్ మ్యాన్ కమిషన్ నివేదిక రాబోతోందని వెల్లడి
- శాసన మండలిలో సభ్యుల ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానం
- డీఎస్సీ నోటిఫికేషన్‌పై లోకేష్ కీలక ప్రకటన



స్వర్ణసాగరం అమరావతి

డీఎస్సీ నోటిఫికేషన్‌పై మంత్రి నారా లోకేష్ కీలక ప్రకటన చేశారు. మంగళవారం ఉదయం ఐదవ రోజు ఏపీ శాసనమండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రశ్నోత్తరాల సమయంలో డీఎస్సీపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానం ఇచ్చారు. ఎట్టిపరిస్థితుల్లో మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని గుర్తు చేశారు. తిరిగి ఈ ప్రభుత్వంలో - మిగతా3లో

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# విశ్వసనీయ భాగస్వామిగా భారత్

**న్యూఢిల్లీ :** నాణ్యమైన వస్తువులు ఉత్పత్తి చేయగల విశ్వసనీయ భాగస్వామిగా భారత్ వైపు ప్రపంచం చూస్తున్న తరుణంలో భారతీయ పరిశ్రమ రంగం ప్రపంచ అవకాశాల సద్వినియోగానికి 'భారీ చర్యలు' తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం కోరారు. 'నియంత్రణ, పెట్టుబడి, వ్యాపార సంస్కరణలు, నిర్వహణలో సౌలభ్యం' అంశంపై బడ్జెట్ అనంతర వెబినార్‌లో మోడీ ప్రసంగిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితుల వల్ల ఏర్పడిన సప్లై చైన్ అంతరాయాల నడుమ ప్రపంచానికిఇప్పుడు అధిక నాణ్యమైన వస్తువులు ఉత్పత్తి చేయగల, ఆధారపడదగిన సప్లై చైన్ ఉన్న విశ్వసనీయ భాగస్వామి అవసరం ఉన్నదని చెప్పారు. 'మన దేశానికి ఈ పని చేయగల సత్తా ఉంది, మీ అందరూ (పరిశ్రమ) సత్తా ఉన్నవారు, ఇది మనకు మహత్తర అవకాశం. ప్రపంచం అంచనాలను కేవలం ఒక వీక్షకునిగా మన పరిశ్రమ చూడరాదని కోరుకుంటున్నా. మనం వీక్షకులుగా ఉండిపోరాదు, దీనిలో మీకు పాత్ర ఉందని మీరు గ్రహించవలసి ఉంటుంది, మీ కోసం అవకాశాలను మీరు కోరుకోవలసి ఉంటుంది' అని ప్రధాని మోడీ పారిశ్రామిక



అధిపతులతో చెప్పారు. ప్రభుత్వం గడచిన పది సంవత్సరాలుగా పరిశ్రమతో కలసి పని చేస్తున్నదని, సంస్కరణలు చేపట్టడానికి, ఆర్థిక క్రమశిక్షణకు, పారదర్శకతకు.సమ్మిళిత వృద్ధికి తన నిబద్ధతను ప్రదర్శించిందని ప్రధాని తెలియజేశారు. 'ఇప్పుడు భారత్ ప్రపంచానికి వృద్ధి మార్గదర్శక దేశం. సంక్లిష్ట సమయాల్లో ధీరచిత్తంతో ఉండగలనని భారత్ నిరూపించింది. ప్రస్తుతం ప్రతి దేశంభారత్‌తో తమ ఆర్థిక భాగస్వామ్యాన్ని పటిష్ఠం చేయాలని వాంఛిస్తోంది. మన ఉత్పత్తి రంగం ఈ భాగస్వామ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి' అని మోడీ ఉద్ఘాటించారు. ప్రభుత్వ నిలకడ, సంస్కరణలకు హామీ కారణంగా పరిశ్రమ నూతన ఆత్మ విశ్వాసం పొందిందని ఆయన చెప్పారు.'రానున్న సంవత్సరాల్లో ఇది కొనసాగుతుందని ఉత్పత్తి, ఎగుమతుల రంగాల్లో సంబంధిత సంస్థలకు హామీ ఇవ్వాలని అనుకుంటున్నా. మీరు దృఢవిశ్వాసంతో ముందుకు సాగి, భారీ అడుగులు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నా. దేశ ఉత్పత్తి, ఎగుమతుల రంగాలకు కొత్త మార్గాలు తెరచుకున్నాయి' అని మోడీ చెప్పారు. 'రాష్ట్రాలు తమలో తాము పోటీ పడాలిఌ ప్రగతిశీలక విధానాలతో రాష్ట్రాలు ముందుకు వస్తే కంపెనీలు వాటిని పెట్టుబడికి ఆకర్షణీయ గమ్యస్థానాలుగా భావిస్తాయి' అని మోడీ సూచించారు.

# లెక్క సరిచేశారు

### సెమీఫైనల్‌లో అదరగొట్టిన భారత్
### ఆస్ట్రేలియాను ఓడించి ఫైనల్‌లోకి అడుగు
### మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడిన విరాట్ కోహ్లీ

**దుబాయ్**

ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం (మార్చి 4) దుబాయ్ వేదికగా జరిగిన సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాను ఓడించింది. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీలో వరుసగా మూడోసారి ఫైనల్ చేరింది. ఛేజ్ మాస్టర్ విరాట్ కోహ్లీ సత్తా చాటటంతో భారత్.. ఆస్ట్రేలియా నిర్దేశించిన 265 పరుగుల లక్ష్యాన్ని 4 వికెట్ల తేడాతో ఛేదించింది. దీంతో ఓటమి అనేది లేకుండా ఫైనల్ చేరింది. ఛేజింగ్ మాస్టర్ విరాట్ కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రేపు జరిగే రెండో సెమీస్‌లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. ఇందులో గెలిచిన జట్టుతో మార్చి 9న భారత్ ఫైనల్ ఆడనుంది టీమిండియా. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టు బ్యాటర్లలో స్టీవెన్ స్మిత్ (73), అలెక్స్ కేరీ (61) రాణించారు. భారత్ అంటేనే రెచ్చిపోయి ఆడే ట్రావిస్ హెడ్‌ను వరుణ్ చక్రవర్తి బోల్తా కొట్టించాడు. ఈ మ్యాచ్‌లో తాను వేసిన రెండో బంతికే క్యాచ్ ఔట్ రూపంలో పెవిలియన్ పంపించాడు. దీంతో 33 బంతుల్లో 39 రన్స్ చేసి హెడ్.. ఔట్ అయ్యాడు. భారత బౌలర్లలో మహమ్మద్ షమీ 3 వికెట్లు తీయగా.. వరుణ్ చక్రవర్తి 2, రవీంద్ర జడేజా 2 వికెట్లు పడగొట్టారు. అక్షర్ పటేల్ 1, హార్దిక్ పాండ్యా 1 వికెట్ తీశారు.

**భారత్ ఇన్నింగ్స్ :** అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్.. 8 పరుగులు మాత్రమే చేసి ఔట్ అయ్యాడు. అయితే రోహిత్




శర్మ 29 బంతుల్లో 28 రన్స్ చేసి.. గట్టి పునాది వేశాడు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన ఛేజ్ మాస్టర్ విరాట్ కోహ్లీ.. అదరగొట్టాడు. తనమార్కు బ్యాటింగ్‌తో ఆస్ట్రేలియా బౌలర్లను తుత్తునీయలు చేశాడు. అయితే సెంచరీ దిశగా సాగుతున్న విరాట్ కోహ్లీ.. 98 బంతుల్లో 84 రన్స్ చేసి, ఓ భారీ షాట్‌కు ప్రయత్నించి ఔట్ అయ్యాడు. శ్రేయస్ అయ్యర్ (45) కూడా విలువైన ఇన్నింగ్స్ ఆడాడు.ఇక కోహ్లీ ఔట్ అయ్యాక.. క్రీజులో వచ్చిన హార్దిక్ పాండ్యా తనదైన శైలిలో ఫోర్లు, సిక్సర్లు బాదాడు. బంతికి పరుగు చొప్పున చేయాల్సిన పరిస్థితులో బ్యాటింగ్‌కు వచ్చినా.. మూడు సిక్సులు, 1 ఫోర్ కొట్టి సమీకరణాన్ని తేలిక చేశాడు. మరో ఆరు పరుగులు చేస్తే విజయం సాధించే సమయంలో సిక్స్ కొట్టేందుకు ప్రయత్నించిన పాండ్యా.. లాంగాన్‌లో క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. 24 బంతుల్లో 28 రన్స్ చేసి.. జట్టు విజయాన్ని తేలిక చేశాడు. రవీంద్ర జడేజాతో కలిసి కేఎల్ రాహుల్ లాంఛనాన్ని పూర్తి చేశాడు.ఇక ఛాంపియన్స్ ట్రోఫీలో వరుసగా మూడోసారి భారత్ ఫైనల్ చేరింది. 2013లో ఛాంపియన్‌గా నిలిచన భారత్.. 2017లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఈసారి ఎలాగైనా కప్పు కొట్టడమే లక్ష్యంగా ఫైనల్ చేరింది. రేపు జరిగే రెండో సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ తలపడనున్నాయ. ఇందులో గెలిచిన జట్టు మార్చి 9న భారత్‌తో దుబాయ్ వేదికగా ఫైనల్ మ్యాచ్ ఆడనుంది.


**స్కోరుబోర్డు**

**ఆస్ట్రేలియా:** హెడ్ (సి) గిల్ (బి) వరుణ్ 39బీ కూపర్ (సి) రాహుల్ (బి) షమి 0బీ స్మిత్ (బి) షమి 73బీ లబుషేన్ (ఎల్బీ) జడేజా 29బీ ఇన్‌గ్లిస (సి) విరాట్ (బి) జడేజా 11బీ క్యారీ (రనౌట్) 61బీ మ్యాక్స్‌వెల్ (బి) అక్షర్ 7బీ ద్వార్షిస్ (సి) శ్రేయాస్ (బి) వరుణ్ 19బీ జంపా (బి) హార్దిక్ 7బీ ఎల్లిస్ (సి) విరాట్ (బి) 10బీ తన్వీర్ సంఘా (నాటౌట్) 1బీ ఎక్స్‌ట్రాలు 7బీ మొత్తం: 49.3 ఓవర్లలో 264 ఆలౌట్.

**భారత్:** రోహిత్ (ఎల్బీ) కూపర్ 28బీ గిల్ (బి) ద్వార్షిస్ 8బీ విరాట్ (సి) ద్వార్షిస్ (బి) జంపా 84బీ శ్రేయాస్ (బి) జంపా 45బీ అక్షర్ (బి) ఎల్లిస్ 27బీ రాహుల్ (నాటౌట్) 42బీ హార్దిక్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) ఎల్లిస్ 28బీ జడేజా (నాటౌట్) 2బీ ఎక్స్‌ట్రాలు: 3బీ మొత్తం: 48.1 ఓవర్లలో 267/6.

# కశ్మీర్ లా మారిపోయిన రాజస్థాన్

**జైపూర్ :** రాజస్థాన్ ఈ పేరు వినిపిస్తే చాలు ఎడారి గుర్తుకువస్తుంది.. మండే ఎండలు, ఇసుక దిబ్బల ప్రాంతం కళ్ళ ముందు కనిపిస్తుంది. ఇక మామూలుగా ఫిబ్రవరి నుంచే అక్కడ ఉష్ణోగ్రతలు మండిపోతుంటాయి.. జనాలకు చుక్కలు చూపిస్తుంటాయి.విస్తరించిన ఎడారికి, కనుచూపుమేర కనిపించే ఇసుకదిబ్బలకు నెలవైన రాజస్థాన్ రాష్ట్రంలో ఫిబ్రవరి నెల నుంచే ఎండలు మండిపోతుంటాయి. ఈ ఎండల వల్ల అక్కడ అనధికారిక కర్ఫ్యూ వాతావరణం నెలకొంటుంది. అయితే ఇప్పుడు రాజస్థాన్ రాష్ట్రం కాశ్మీర్ ప్రాంతాన్ని తలపిస్తోంది. రాజస్థాన్ రాష్ట్రంలోని చురు ప్రాంతం మంచుతో నిండిపోయింది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల రాజస్థాన్ లో శుక్రవారం వడగళ్ల వర్షం కురిసింది. దీంతో ఆ ప్రాంతం మొత్తం మంచు గడ్డలతో నిండిపోయింది. ఫలితంగా అది కాశ్మీర్ ప్రాంతాన్ని తలపిస్తోంది. వడగళ్ల వర్షం కురవడం వల్ల పంటలు మొత్తం దెబ్బతిన్నాయి. ప్రస్తుతం అక్కడ రాగి, సజ్జ, బంగాళదుంప పంటలు కోతకు వచ్చాయి.. ఈ సమయంలో వడగళ్ల వర్షం కురవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.. సాధారణంగా ఫిబ్రవరి రెండవ వారం నుంచి రాజస్థాన్ రాష్ట్రంలో ఎండలు విపరీతంగా ఉంటాయి. ఈ ఎండల వల్ల అక్కడ జనజీవనం స్తంభించిపోతుంది..రాజస్థాన్ రాష్ట్రం అంటే నిప్పులు కురిపించే ఎండలు గుర్తుకు వస్తాయి. విస్తరించిన థార్ ఎడారి మదిలో మెదులుతుంది. ఇసుక దిబ్బలు, ఒంటెలతో ఆ ప్రాంతం ఒక రకమైన వాతావరణంలో కనిపిస్తుంది. సాధారణంగా ఫిబ్రవరి నెల నుంచే రాజస్థాన్ రైతులు గొర్రెలు, మేకలు, ఆవులను మేత కోసం ఇతర ప్రాంతాలకు తీసుకెళుంటారు. జూన్ వరకు కూడా వారు అక్కడే ఉంటారు. ఫిబ్రవరి నుంచి రాజస్థాన్ లో ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగానే



నమోదవుతుంటాయి. ఇక మార్చిలో అయితే ఎండలు మండిపోతుంటాయి. ఏప్రిల్, మే నెలల గురించి అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. అయితే ఫిబ్రవరి నెలలో ఎండలు కొట్టాల్సిన రాజస్థాన్ రాష్ట్రంలో.. వడగళ్ల వర్షం కురిసింది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల మంచు గడ్డలు పడ్డాయి . దీంతో ఆ ప్రాంతం మొత్తం కాశ్మీర్ రాష్ట్రాన్ని తలపిస్తోంది. రాజస్థాన్ రాష్ట్రం లోని కొంత ప్రాంతం హిమాలయాలకు దగ్గరగా ఉంటుంది. చలికాలంలో ఇక్కడ ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతుంటాయి. మంచు కూడా విపరీతంగా కురుస్తూ ఉంటుంది. అయితే అలాంటి వాతావరణం ఫిబ్రవరిలో చోటు చేసుకోవడం అక్కడి ప్రజలకు కూడా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. చేతికి వచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇక రాజస్థాన్ రాష్ట్రంలో కురిసిన మంచి వర్షానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. "మండే ఎండలతో ఉక్కిరిబిక్కిరయ్యే మాకు మంచు వర్షం కాస్త సాంత్వన కలిగించింది. దీనివల్ల మాకు ఎండ నుంచి ఉపశమనం దక్కిందని" సోషల్ మీడియాలో రాజస్థాన్ వాసులు పేర్కొంటున్నారు.రాజస్థాన్ రాష్ట్రంలో నిత్యం భారీగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటాయి. ప్రస్తుతం మొన్నటి వరకు అక్కడ ఎండలు దంచి కొట్టాయి. అలాంటి చోట మంచు వర్షం కురిసింది. ఇప్పుడు ఆ ప్రాంతం మొత్తం కాశ్మీర్ రాష్ట్రాన్ని తలపిస్తోంది.

## విద్వేష ప్రసంగాల కట్టడికి కఠిన చట్టం..
## కర్ణాటక సర్కారు కసరత్తు

విద్వేష ప్రసంగాలు, విద్వేషపూరిత నేరాల కట్టడి కోసం కర్ణాటక ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. అందుకోసం కఠినమైన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. త్వరలో దీనికి సంబంధించి ముసాయిదా బిల్లును రూపొందించనున్నట్లు తెలిపింది. విద్వేష ప్రసంగాలు చేసేవాళ్లకు, విద్వేష కార్యకలాపాలకు పాల్పడేవాళ్లకు కఠిన శిక్షలు, తీవ్రమైన జరిమానాలు విధించేలా ఈ చట్టాన్ని రూపొందించబోతున్నారు. బహిరంగ సభల్లో విద్వేష ప్రసంగాలను ఈ కొత్త చట్టం నిరోధించనుంది. ఒక వ్యక్తినిగానీ, ఒక సంఘాన్ని గానీ, కులం పేరుతో, మతం పేరుతో,



లింగం పేరుతో ద్వేషించకుండా ఈ బిల్లు అడ్డుకుంటుంది. సోషల్ మీడియాలో ప్రసారమయ్యే విద్వేషపూరిత కంటెంట్‌ను కొత్త చట్టం నిరోధిస్తుంది. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి కనిష్ఠంగా మూడేళ్లు, గరిష్ఠంగా ఐదేళ్ల జైలుశిక్ష పడనుంది. మళ్లీ మళ్లీ చట్టాన్ని ఉల్లంఘించేవారికి అంతకంటే కఠిన శిక్షలు వేసేందుకు చట్టం అవకాశం కల్పిస్తుంది. దీనికి సంబంధించి త్వరలో ముసాయిదా బిల్లును రూపొందించి న్యాయ సలహా కోరాలని కర్ణాటక సర్కారు భావిస్తోంది. మార్చిలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు ముందే ఈ ప్రక్రియను పూర్తిచేసి బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని యోచిస్తోంది.

## ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకంపనలు



**వాషింగ్టన్ :** ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకంపనలు తీవ్రంగా ఉంటున్నాయి. కెనడా, మెక్సికో దేశాల ఉత్పత్తులపై 25 శాతం వరకు విధించిన సుంకాలు మంగళవారం నుంచి అమలు లోకి రాగా, ఆ దేశాలు కూడా అమెరికా ఉత్పత్తులపై 25 శాతం వరకు సుంకాలు విధించాయి. అవి మార్చి 10 నుంచి అమలు లోకి రానున్నాయి. ఇప్పటికే చైనా ఉత్పత్తులపై 10 శాతం ప్రతీకార సుంకాలు విధించిన ట్రంప్ తాజాగా 20 శాతానికి పెంచడం తెలిసిందే. ఫెంటనిల్ డ్రగ్స్ అక్రమ రవానాను అడ్డుకోవడంలో బీజింగ్ విఫలమవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని ట్రంప్ ప్రకటించారు.చైనాపై సుంకాలు గత నెల నుంచే అమలు కాగా, తాజాగా వాటిని 20 శాతానికి పెంచడం గమనార్హం. దీనికి తగ్గట్టు చైనా కూడా అమెరికాకు గట్టి బదులిచ్చింది. అమెరికా నుంచి దిగుమతి అవుతోన్న వస్తువులపై 10 నుంచి 15 శాతం ప్రతీకార సుంకాలు విధించింది. సోయాబీన్, పోర్క్, ఇతర ఉత్పత్తులపై 10 శాతం , చికెన్, మొక్కజొన్న, పత్తి వంటి ఉత్పత్తులపై 15 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించింది. మార్చి 10 నుంచి అవి అమలు లోకి వస్తాయని చైనా ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించింది. మరోవైపు కెనడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం సుంకాల విషయంలో ఎలాంటి మార్పు లేదని ట్రంప్ వెల్లడించారు.మార్చి 4 (అమెరికా కాలమానం ప్రకారం ) నుంచి అవి యథావిధిగా అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. దీనికి ప్రతిగా ట్రూడో కూడా అమెరికాపై సుంకాలు విధించారు.అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఆల్కహాల్, పండ్లు, సహా 107 బిలియన్ డాలర్ల ఉత్పత్తులపై తాము కూడా 25 శాతం సుంకం విధిస్తున్నట్టు వెల్లడించారు. ఇవి కూడా మంగళవారం నుంచే అమల్లోకి వస్తున్నట్టు తెలిపారు. ట్రంప్ సుంకాల దెబ్బకు అమెరికా మార్కెట్లు కుదేలయ్యాయి. ఆసియా పసిఫిక్,ఆస్ట్రేలియా మార్కెట్ల పైనా ఈ ప్రభావం పడింది.

## హత్య కేసులో ఆరోపణలు
## మహా మంత్రి రాజీనామా

**ముంబయి :** మహారాష్ట్రలోని బీడ్ జిల్లా మసాజోగ్ గ్రామ సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్ హత్య ఆ రాష్ట్రంలో రాజకీయ దుమారం రేపుతోంది. ఆ ఘటనకు బాధ్యత వహిస్తూ ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ధనంజయ్ ముండే మంగళవారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ధనంజయ సన్నిహిత సహచరుడు వాల్మిక్ కరాడ్‌ను సర్పంచ్ హత్య కేసులో సూత్రధారిగా పేర్కొన్న కొన్ని రోజుల తరువాత ఈ పరిణామం చోటు చేసుకున్నది. రాజీనామా చేయాలని ఆయనను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఆ అంశంపై ఫడ్నవీస్ మీడియాతో మాట్లాడుతూ, ధనంజయ్ రాజీనామాను తాను ఆమోదించి గవర్నర్‌కు పంపానని తెలియజేశారు. ఎన్‌సిపి అజిత్ పవార్ వర్గంలో ధనంజయ్ కీలక నేతగా ఉన్నారు.ఆయన సొంత జిల్లా బీడ్. సంతోష్‌ను కిడ్నాప్ చేసి, ఆ తరువాత చిత్రహింసలకు గురి చేసి చంపేశారు.ఆ హత్య కేసులో ధనంజయ్ సన్నిహితుడు వాల్మిక్ కరాడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ ధనంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ధనంజయ్‌కు వ్యతిరేకంగా ఉన్న ఆధారాలను అజిత్ పవార్‌కు తాను అందజేశానని సామాజిక కార్యకర్త అంజలి దమానియా చెప్పడంతో మంత్రి రాజీనామా చేయాలనే డిమాండ్లు ఊపు అందుకున్నాయి. ఎన్‌సిపి (శరద్ పవార్) కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సూలే కూడా ధనంజయ రాజీనామా చేయాలని కోరారు. ఈ నేసథ్యంలో ధనంజయ్ ఇటీవల మాట్లాడుతూ, మంత్రి పదవికి రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ చెబితే వెంటనే రాజీనామా చేస్తానని ప్రకటించారు. ఈ క్రమంలో చివరకు ధనంజయ రాజీనామా చేశారు.

## పిల్లల్ని కనండి.... మహాప్రభో...

**చెన్నై :** చైనాలో జనాభా సంక్షోభం ఏర్పడింది. జనాభాను పెంచడానికి ఆ దేశం రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. ఉద్యోగులకు సరికొత్త అవకాశాలు కల్పిస్తోంది. ఇక జపాన్ కూడా అదే పని చేస్తోంది. దక్షిణ కొరియాలోను జనాభా సంక్షోభం తీవ్రంగా ఉంది..



ఇక మన దేశంలో అలాంటి పరిస్థితులు లేకపోయినప్పటికీ.. భవిష్యత్తులో ఇలాంటి దుస్థితి ఉండదన్న గ్యారెంటీ లేదు మన దేశానికి వస్తే దక్షిణ భారతదేశంలో జనాభా సంక్షోభం ఉంది. అందువల్లే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పిల్లల్ని కనాలని ప్రజలకు పిలుపునిస్తున్నారు. వీలైనంతమంది ఎక్కువ పిల్లల్ని కంటే బాగుంటుందని.. వినియోగదారుల మార్కెట్ పెరిగి రాష్ట్రాలు బాగుపడతాయని చెబుతున్నారు. జనాభా ఎక్కువగా ఉండటం వల్లే ఉత్తర భారత దేశంలో పార్లమెంటు స్థానాలు ఎక్కువగా ఉన్నాయని.. ఆ రాష్ట్రాలకు చెందిన నాయకులే దేశాన్ని పరిపాలిస్తున్నారని వారు చెబుతున్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో చంద్రబాబు ఉన్న నేపథ్యంలో పార్లమెంటు స్థానాల గురించి మాట్లాడకపోయినప్పటికీ.. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మాత్రం నేరుగా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. త్వరలో తమిళనాడు రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో స్టాలిన్ పార్లమెంటు స్థానాలు, హిందీ వ్యతిరేక అంశాలను తెరపైకి తెచ్చారు. ప్రస్తుతం తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉంది. ముఖ్యమంత్రిగా స్టాలిన్ ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధానానికి వ్యతిరేకంగా డీఎంకే కార్యకర్తలు అక్కడ ఉద్యమం చేస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంపై హిందీని బలవంతంగా రుద్దకూడదని డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలపై హిందీతో రాసిన అక్షరాలను నలుపు రంగుతో తుడిచివేస్తున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మరోసారి అధికారం దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా తమ ప్రభుత్వం చేసిన తప్పులను డైవర్ట్ చేయడానికి తెలివిగా జాతీయ అంశాలను ఎంచుకుంటున్నారు.. రాజకీయ ప్రాబల్యం తగ్గిపోతున్న నేపథ్యంలో.. వీలైనంత ఎక్కువ మంది పిల్లల్ని కనాలని.. అప్పుడే దక్షిణ భారత దేశంలో తమిళనాడు కీలకంగా ఉంటుందని స్టాలిన్ వ్యాఖ్యానించారు. తమిళనాడులో జరిగిన ఓ సభలో స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు."గతంలో కుటుంబ నియంత్రణను విజయవంతంగా అమలు చేశాం. ఇప్పుడు పిల్లల్ని కనాలని పిలుపునిస్తున్నాం. అందువల్లే ప్రజలు నా మాట వినడానికి కోరుతున్నామని" స్టాలిన్ పేర్కొన్నారు.. స్టాలిన్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బిజెపి, ఇతర పార్టీలు భిన్నంగా స్పందిస్తున్నాయి. "డీఎంకే ప్రభుత్వం ఆధ్వర్యంలో అనేక కుంభకోణాలు జరిగాయి. ఇప్పుడు ఎన్నికల్లో ఆ విషయం బయటపడుతుందని స్టాలిన్ భయపడుతున్నారు. అందువల్లే డైవర్ట్ పాలిటిక్స్ కు తెర తీశారు. ఇప్పటికే డిఎంకె నేతలపై ఈడీ కేసులు నమోదు చేసింది. అక్రమాలకు పాల్పడ్డారని అభియోగాలు నమోదు చేసింది. అవినీతి మరకలను తుడిచి వేసుకునే ధైర్యం లేక స్టాలిన్ ఇలాంటి పనికిమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రజలకు వాస్తవాలు మొత్తం తెలుసని" బిజెపి నాయకులు ఆరోపిస్తున్నారు.

# వైసీపీ హానీకరం..

-మొదటిపేజీ తరువాయి

వైసీపీపై సీరియస్ వ్యాఖ్యలు చేశారు. అలాగే రాష్ట్ర పరిస్థితిపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అంతే కాకుండా నాటి, నేటి ప్రభుత్వాల మధ్య తేడాలను చెప్పారు. బాలయ్య డైలాగ్స్ చెబుతూ ఇరు ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలను సభ ముందు ఉంచారు మంత్రి పయ్యావులు. వైసీపీ సమాజానికి హానికరం అంటూ కామెంట్స్ చేశారు. సిగరెట్ పెట్టెల మీద స్టాట్యూరీ వార్నింగ్ ఇచ్చినట్టుగా.. వైసీపీ సమాజానికి హానీకరం అంటూ పదే పదే చెప్పాల్సిన బాధ్యత తమసపై ఉందన్నారు. సభకు రాకుండా డ్రాప్ అవుట్ ఎమ్మెల్యేలు బయట కూర్చొని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

గత ప్రభుత్వం గురించి పదే పదే ప్రస్తావించడం దేనికని ప్రశ్నిస్తున్నారన్నారు. వైసీపీ హానికరం అనే విషయాన్ని ఇప్పటికే ప్రజలు గుర్తించారని.. అందుకే ఆ పార్టీని 11 స్థానాలకు పరిమితం చేశారని తెలిపారు. బక్కోడి బువ్వను లాక్కొని బలిసిపోదామంటే కుదరదని.. గత ప్రభుత్వం బక్కోడి బువ్వను లాక్కొనే ప్రయత్నం చేసింది కాబట్టే.. ప్రజలు కూటమికి అనుకూలంగా అద్భుతమైన తీర్పు ఇచ్చారని చెప్పుకొచ్చారు. "లిక్కర్ , సిగరెట్ పై వేసే స్టాట్యటరీ వార్నింగ్‌లాగా వైసీపీ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఈ విషయాన్ని శాసన సభ్యులు జనం లోకి తీసుకువెళ్ళాలి. మీరు అనుమతిస్తే నా సమయం తగ్గించుకొని వైసీపీ వారు ఏం మాట్లాడుతారో మాట్లాడమనండి. జీత భత్యాలు, అప్పులు, వడ్డీలకు వచ్చే ఆదాయం సరిపోతుంది అది కూడా 1శాతం లోటు ఉంది ... దీనిలో కమిటెడ్ ఎక్సపెండీచర్ చూపలేదు. అప్పు చేయడం తప్పుకాదు... చేసిన అప్పు క్యాపిటల్ ఇన్వెష్టమెంట్‌లో చేయాలి... ప్రోడక్టవిటీ పెంచాలి. చంద్రబాబు ఉన్నప్పుడు వ్యవసాయ రంగం 16 శాతం.... సేవల రంగం 12 శాతం ఉండగా.. . జగన్ వచ్చాక వ్యవసాయం, సేవల రంగం 3 శాతం పడిపోయింది. ఈ మూడు శాతం ఉంటే 76 వేల కోట్లు అదనంగా వచ్చేది. అధికారులను అందరికి ఇదే డైరెక్షన్‌లో ముందుకు వెళ్లే లా చూడాలిని కోరుతున్నా. అప్పుపుట్టే సామర్థ్యం పెరిగితే ప్రాజెక్టులపై పెట్టుబడి పెట్టే శక్తి పెరుగుతుంది. 2014-19 మధ్య ఇరిగేషన్‌లో 40వేల కోట్లు ఖర్చు పెట్టారు. విడిపోతే పడిపోతాం అని అనుకున్నాం అయితే చంద్రబాబు



నిలబెట్టాడు పరుగుపెట్టించారు. గత అయిదేళ్లలో వైసీపీ ఏం చేసింది. రాయలసీమ, ఉత్తరాంధ్ర నుంచి నీటి కోసం విజ్ఞప్తులు వచ్చేవి. అయితే ఇప్పుడు కృష్ణ, గుంటూరు, ఉభయగోదావరి జిల్లల నుంచి వస్తున్నాయి" అని మంత్రి తెలిపారు.

ఆర్థిక పరిస్థితిపై ప్రజెంటేషన్..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సభలో ప్రజెంటేషన్ ఇచ్చారు పయ్యావుల. వచ్చే ఆదాయమెంత.. పెడుతున్న ఖర్చులు ఎంత అంటూ ప్రజెంటేషన్ ద్వారా వివరణ ఇచ్చారు. రాష్ట్రానికి రూ.154065 కోట్ల రూపాయల ఆదాయం ఉంటే.. ఖర్చు రూ.154971 కోట్ల రూపాయలుగా ఉందన్నారు. రాష్ట్రాన్ని ఇంతటి ఆర్థిక దుస్థితిలోకి నెట్టేసి వెళ్లిపోయింది గత ప్రభుత్వం అంటూ మండిపడ్డారు. వచ్చే ఆదాయం అంతా.. బొటాబోటిగా ఖర్చులకు సరిపోతుందన్నారు. బయట ఉండి ఏదేదో కామెంట్లు చేసే బదులు.. సభకు వచ్చి చెప్పొచ్చుగా అని హితవుపలికారురు. "స్పీకర్ అనుతిస్తే.. నా టైమ్ తగ్గించుకుని వారికి మాట్లాడే సమయం ఇస్తాను. అయినా వారు సభకు రాలేరు.. కారణం వాళ్లు చేసిన ఆర్థిక విధ్వంసం" అంటూ పయ్యావుల వ్యాఖ్యలు చేశారు.

**సభలో బాలయ్య డైలాగ్స్**

అలాగే గత ప్రభుత్వం, ప్రస్తుతవ ప్రభుత్వం మధ్య తేడాలను వివరిస్తూ బాలయ్య కామెంట్లను సభలో ప్రస్తావించారు మంత్రి. బోత్ ఆర్ నాట్ సేమ్ అంటూ సభలో నాటి, నేటి ప్రభుత్వాల మధ్య తేడాను వివరించారు. వైసీపీ సంపద సృష్టి వేరని.. కూటమి సంపద సృష్టి వేరన్నారు. వైసీపీ సంపద వారి కుటుంబాల కోసం అయితే.. కూటమి సంపద సృష్టి సమాజం కోసమని చెప్పుకొచ్చారు. బాలయ్య మాటల్లో చెప్పాలంటే.. బోత్ ఆర్ నాట్ సేమ్ అని అన్నారు. ఎక్సైజ్, గనులు, ఇసుక ఆదాయం దారి మళ్లలేదా అని ప్రశ్నించారు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ఎన్ని కూటములు చూశామని.. కానీ చంద్రబాబు-పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న సఖ్యత చూసి అసెంబ్లీ డ్రాప్ అవుట్ల కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని విమర్శించారు. ఇక ప్రధాని నరేంద్ర మోడీతో ఉన్న రిలేషన్స్ చూసి.. కుళ్లు కుంటున్నారని తెలిపారు. ఈ బంధానికి పునాది రాష్ట్రం.. రాష్ట్ర శ్రేయస్సు.. రాష్ట్ర భవిష్యత్తు.. ఇందులో రాజకీయ కారణం లేదని.. స్వార్థ ప్రయోజనాలు లేవని స్పష్టం చేశారు.

**ఇంత వడ్డీనా.. వీళ్లనేమనాలి..**

9 శాతానికి మించి ఉన్న అప్పులను గుర్తించామని.. దాదాపు 141 రుణాలు ఉన్నాయన్నారు. కొన్ని దాదాపు 13.4 శాతం వరకు వడ్డీకి తెచ్చారని తెలిపారు. 9 శాతం.. 10 శాతం.. 11 శాతం.. 12 శాతం.. ఇలా పెంచుకుంటూ పోతూ ఏకంగా 13.4 శాతానికి అప్పులు తీసుకొచ్చారంటే.. వీళ్లనేమనాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ అనే సంస్థ ద్వారా గత ప్రభుత్వం అప్పు తీసుకుందని.. ఈ రోజుకు ఆ సంస్థకు 154 కోట్ల రూపాయల మేర అప్పు ఉందన్నారు. ఈ అప్పును 13.4 శాతం మేర వడ్డీకి తెచ్చారని తెలిపారు. అంటే సంవత్సరానికి ఈ అప్పుపై వడ్డీనే 20.60 కోట్ల రూపాయల మేర చెల్లింపులు జరపాల్సి వస్తుందని.. ఇప్పుడు తాము బ్యాంకర్లతో సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించారు. బ్యాంకర్లు అంగీకరిస్తే.. ఆ వడ్డీ రేటు 9 శాతానికి తగ్గుతుందన్నారు. అప్పుడు ప్రభుత్వం చెల్లించాల్సిన వడ్డీ 13.83 కోట్లు రూపాయలుగా ఉంటుందని వివరించారు. అంటే ఈ ఒక్క రుణం మీదే 6.76 కోట్ల రూపాయల మేర భారం తగ్గుతుందన్నారు. ఇలా 1 లక్ష కోట్ల రూపాయల అప్పు మీద వడ్డీ రేట్లు తగ్గితే.. రాష్ట్ర ఖజానాపై భారం ఎంత వరకు తగ్గుతుందో ఆలోచించాలన్నారు. బ్యాంకర్లతో నెగోషియేషన్స్ మొదలయ్యాయని.. ఈ నెలాఖరుతో వడ్డీ రేట్లు తగ్గించగలమని ఆశాభావంతో ఉన్నామని చెప్పారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ క్లీన్ స్వీప్

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి తన సత్తా చాటింది. కూటమి మద్దతు ఇచ్చిన అన్ని స్థానాల్లో ఆ యా అభ్యర్థులు విజయాన్ని అందుకున్నారు. అంతేకాదు.. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులు 65 శాతానికి పైగా ఓట్లు నమోదయ్యాయి. సాధారణ ఎన్నికల్లో కూటమికి ఓటరు పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. వాటి అనంతరం రాష్ట్రంలో జరిగిన తొలి ఎన్నికలు.. వీటిలో సైతం కూటమి ఘన విజయం సాధించింది. కూటమి అధికారం చేపట్టి.. జస్ట్ ఎనిమిది నెలల తర్వాత వచ్చన ఈ ఎన్నికల్లో ప్రజలు ఏక పక్ష తీర్పు ఇవ్వడం ద్వారా చంద్రబాబు సారథ్యంలోని ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినట్లు అయింది.

టీడీపీ అభ్యర్థులు పోటీ చేసిన రెండు స్థానాల్లో వారు తిరుగులేని మెజార్టీతో గెలుపొంది రికార్డు సృష్టించారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 67 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఈ ఎన్నికల్లో 8 నెలల పాలనను దీవించేలా తీర్పు వచ్చిందనే ఓ చర్చ సైతం సాగుతోంది. 2024లో జరిగిన ఎన్నికల్లో 57 శాతం ఓట్ షేర్ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే.. నేడు అంతకు మించి అంటే.. 65 శాతంపైగా ఓట్ షేర్‌తో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం లభించింది.

ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు1,45,057 ఓట్లు పోలవడం ద్వారా మొత్తం ఓట్లలో 67.51 శాతానికి పైగా సాధించారు. ఇంకా చెప్పాలంటే.. 82,320 ఓట్ల భారీ మెజారిటీతో ఆయన ఘన విజయం సాధించారు. ఇక ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి కూటమి తరఫున బరిలో నిలిచిన పేరాబత్తుల రాజశేఖర్ 1,24,702 ఓట్లు పొందారు. అంటే మొత్తం ఓట్లలో 62.59% పైగా ఆయన సాధించారు. ఇంకా



చెప్పాలంటే..77,4610 ఓట్లపైగా పోలై.. భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు.

2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాల్లో 59.28 శాతం ఓట్ షేర్ కాగా.. నేడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరింత పెరిగి 62.59 శాతం ఓట్ షేర్‌కు చేరింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కృష్ణా - గుంటూరు జిల్లాల్లో 58.19 శాతం ఓట్ షేర్ రాగా.. తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అది భారీగా పెరిగి 67.51 శాతం ఓట్ షేర్‌కు చేరింది. గత ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో సాధారణ ఎన్నికల్లో 58 శాతం ఓట్ షేర్ రాగా...నేడు 65 శాతం ఓట్ షేర్‌ను కూటమి సాధించింది. తాజా గెలుపుతో మొత్తం 5 పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో 5 గురూ కూటమి అభ్యర్థులే ఉన్నారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 3 పట్టభద్రుల స్థానాలు గెలిచిన కూటమి...నేడు మరో రెండు స్థానాలను గెలుచుకొని.. 5 స్థానాలకు ఏగబాకింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీల్లో వైసీపీ మద్దతు ఇచ్చిన వారికి మూడవ స్థానం దక్కింది. అంతేకాదు.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీ చేసే ధైర్యం వైసీపీ చేయలేక పోయింది. వైసీపీ మద్దతు కారణంగా పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు మరింత నష్ట పోయారు. వైసీపీ మద్దతు ప్రకటించిన తరువాత మరింత కసిగా తరలి వచ్చి వైసీపీకి వ్యతిరేకంగా.. కూటమికి మద్దతుగా పట్టభద్రులు ఓటు వేశారు. 8 నెలల్లో చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల నమ్మకం మరింత పెరిగిందనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని స్పష్టమవుతోంది.

# ప్రభుత్వ ప్రచారానికి ప్రైవేట్ ఏజెన్సీలు

**విజయవాడ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలు, పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించనుంది. అందుకోసం ఏజెన్సీ నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 11వ తేదీన తుది గడువుగా నిర్ణయించింది. గడువులోగా దరఖాస్తు చేసుకున్న ఏజెన్సీల్లో ఒక దాన్ని ఎంపిక చేయనుంది.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ప్రచారం చేసేందుకు సమర్థవంతమైన ప్రైవేట్ ఏజెన్సీని నియమించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే కమ్యూనికేషన్ ఏజెన్సీ ఎంపిక కోసం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుకు మార్చి 11వ తేదీని తుది గడువుగా నిర్ణయించింది. దరఖాస్తు చేసుకోవాల్సిన ఏజెన్సీలకు కొన్ని నిబంధనలను నిర్దేశించింది.ఆసక్తిగల ఏజెన్సీలు ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున గత మూడేళ్లు టర్నోవర్ కలిగి ఉండాలి. అలాగే కనీసం 100 మంది జర్నలిజం, మీడియాలో నిష్ణాతులైన ఉద్యోగులు ఉండాలనే నిబంధనలు విధించింది. వీటితో పాటు సమాచార శాఖ అధికారులు పలు నిబంధనలు పెట్టారు. ఈ నిబంధనలకు సరిపోయిన ఏజెన్సీలు మాత్రమే ప్రభుత్వానికి ప్రచారం చేసేందుకు దరఖాస్తు చేసుకోవడానికి వీలుంటుంది. ఆ నిబంధనలు లేకపోతే, అటువంటి ఏజెన్సీలు తిరస్కరణకు గురవుతాయి. ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం ఏటా వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటారు. అయితే జనవరిలోనే కమ్యూనికేషన్ ఏజెన్సీ ఏర్పాటుపై ప్రకటన విడుదల చేసినప్పటికీ, పరిపాలన పరమైన అంశాల్లో సరవణలు చేసి మళ్లీ తాజాగా నోటిఫికేషన్ జారీ చేశారు.ఎంపికైన ఏజెన్సీ ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి. అలాగే ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి. సంప్రదాయ మీడియాతో పాటు దురదర్శన్, రేడియో, సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలి. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలతో పాటు ఇతర ప్రముఖ భాషల్లోనూ ప్రచారం నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే ప్రభుత్వ పాలన, అభివృద్ధిపై కథనాలను ఆయా మీడియాల్లో వచ్చేలా చూడాలి.మీడియా కవరేజ్, ట్రాకింగ్, విశ్లేషణ చేయడంతో పాటు వివిధ శాఖలకు చెందిన వార్తలను మీడియా సంస్థలకు తెలియజేయాల్సి ఉంటుంది. అవసరం మేరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మీడియా ప్రముఖులతో ట్రిప్‌లను నిర్వహించాలి. సీఎంతో పాటు మంత్రులు, ఉన్నతాధికారుల ఇంటర్వ్యూలు ప్రముఖ వార్తా పత్రికలు, టీవీలు, ఎఫ్ఎం రేడియో చానళ్లలో వచ్చేలా చూడాలి. దేశ, విదేశాల్లోని మీడియా రంగ ముఖ్యలతో ప్రభుత్వ సమావేశాల గురించి తెలియజేయాలి. ప్రభుత్వ సానుకూల, ప్రతికూలతలపై ప్రజాభిప్రాయం సేకరించాల్సి ఉంటుంది. వాటికి అనుగుణంగా వ్యూహాలను సిఫార్సు చేయాల్సి ఉంటుంది.

## వీసీల రాజీనామాలపై దుమారం

-మొదటిపేజీ తరువాయి

డిమాండ్ చేశారు. దేశంలో స్వాతంత్రం వచ్చిన తరువాత ఎక్కడా, ఎప్పుడూ ఇలా వీసీలను బెదిరించి రాజీనామాలు చేయించిన ఘటనలు లేవని అన్నారు. గవర్నర్ నియమించిన విసి లని ఉన్నత విద్యా శాఖ మండలి చైర్మన్, కార్యదర్శులు ఏ విధంగా రాజీనామాలు చేయమని ఆదేశిస్తారు? ఒకేసారి 17 మంది వీసీలు రాజీనామా చేయడంపై జ్యుడీషియల్ విచారణ జరపాలని కోరాం. దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధారాలు చూపాలంటూ సవాల్ విసిరారు. తీరా సభలో అన్ని వివరాలను ముందుంచడంతో, దానిపై సమాధానం చెప్పలేక దబాయింపులు, బుకాయింపులకు దిగారు. పరుష పదజాలంతో దూషణలకు తెగబడ్డారు. వీసీలు తప్పు చేస్తే విచారించండి, వారిపై చర్యలు తీసుకోండి, ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ ప్రభుత్వం మారగానే వైస్ ఛాన్సలర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించడం దారుణం. ఇది మొత్తం విద్యా వ్యవస్థకే కళంకం.

మండలిలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ..వీసీల రాజీనామా లేఖల్లో 'బెదిరించినట్లు' అనే పదం ఎక్కడా లేదు. వైకాపా ఆరోపణలపై నిగ్గుతేల్చేందుకు ప్రివిలేజ్ కమిటీకి పంపాలని మంత్రి లోకేశ్.. స్పీకర్‌ను కోరారు. వీసీల రాజీనామా లేఖల్లో 'బెదిరించినట్లు' అనే పదం ఎక్కడా లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వైకాపా నియమించిన వీసీలకు బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ కూడా రాదని ఎద్దేవా చేశారు. వీసీల రాజీనామా లేఖల్లో బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. "రాజీనామా చేసిన ఒక వీసీ.. రాజారెడ్డి చెల్లెలి కోడలు. రాజీనామా చేసిన ప్రసాద్‌రెడ్డి.. వైకాపా కార్యకర్త. జగన్ పుట్టినరోజు వేడుకలు వర్సిటీలో చేసిన వ్యక్తి ఈ ప్రసాద్ రెడ్డి" అని పేర్కొన్నారు. పార్టీ కోసం సర్వేలు చేయించిన ఘనత ఆనాటి వీసీలదని లోకేశ్ వ్యాఖ్యానించారు.

## పోసానిపై 20కు పైగా కేసులు



-మొదటిపేజీ తరువాయి

నేడు ఆయన పాలిట శాపంగా పరిణమించాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తో పాటు వారి కుటుంబసభ్యులను దూషించిన కేసులు వరసగా నమోదయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఫిర్యాదులు చేసినా నాడు పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వరస కేసులు పోలీసులు నమోదవుతున్నాయి. దీంతో పోసాని కృష్ణమురళిని ఏపీ అంతటా తిప్పుతూ జైళ్లను మార్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఇప్పటికే పధ్నాలుగు నుంచి పదిహేడు కేసులు నమోదయ్యాయి. రాజంపేట సబ్ జైలులో ఉన్న పోసాని కృష్ణమురళిని ప్రస్తుతం పీటీ వారెంట్ పై నరసరావుపేటకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మరొకచోటకు.. ఇలా ఏపీ అంతా ఆయనపై కేసులు నమోదు కావడంతో దాదాపు అన్ని సబ్ జైళ్లను చూపించే అవకాశముందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఒక కేసులో బెయిల్ వచ్చినా, మరొక కేసు రెడీగా ఉండటంతో ఆయన నాలుగు గోడల మధ్య నుంచి ఇప్పట్లో బయటకు వచ్చే అవకాశం లేదని న్యాయనిపుణులు సయితం అంగీకరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోసానిపై వివిధ స్టేషన్లలో 30 పైగా ఫిర్యాదులు పోలీసులకు అందాయి. వాటిల్లో 17 కేసులు నమోదయ్యాయి. లేటెస్ట్‌గా మూడు జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు రాజంపేట జైలుకి వెళ్లారు. గుంటూరుజిల్లా నరసరావుపేట టూ టౌన్ పోలీసులు, అనంతపురం రూరల్, అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు.. పోసానిని తమకు అప్పగించాలని రాజంపేట జైలు అధికారులకు పీటీ వారెంట్లు అందించారు. పోసానిని అప్పగిస్తే తీసుకెళ్లేందుకు వాహనాలు కూడా సిద్ధం చేసుకున్నారట.మూడు జిల్లాల పోలీసులు ఒకేసారి రావడంతో.. ముందుగా పోసానిని ఎవరికి అప్పగించాలనే దానిపై రాజంపేట పోలీసులు ఉన్నతాధికారులతో చర్చించారు. నిబంధనలు పరిశీలించిన అనంతరం పోసానిని పల్నాడుజిల్లా నరసరావుపేట పోలీసులకు అప్పగించారు. వైద్య పరీక్షల అనంతరం పోసానిని నరసరావుపేటకు తరలించారు. వరుసగా కేసులు.. పీటీ వారెంట్లు పోసానిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.పోసానితో పాటు వైసీపీ నేతలపై తీవ్రంగా మండిపడ్డారు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి. పోసాని ఒక మూర్ఖుడు. పోసాని లాంటి వాళ్లతో అప్పుడు తిట్టించి ఇప్పుడు గగ్గోలు పెడతారా? అని నిలదీశారు. తప్పు చేసిన వాళ్లను ఈ ప్రభుత్వం వదిలిపెట్టదన్నారుమొత్తం మీద పోసాని ఏపీ టూర్ వేయక తప్పదన్న సెటైర్లు సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి.

## మార్చి నెలలోనే డీఎస్సీ నోటిఫికేషన్



-మొదటిపేజీ తరువాయి

ఉపాధ్యాయ భర్తీ ప్రక్రియ జరుగుతుందని వెల్లడించారు. వర్గీకరణపై త్వరలోనే వన్ మ్యాన్ కమిషన్ నివేదిక ఇవ్వనుందని చెప్పారు. వైసీపీ హయాంలో ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదని విమర్శించారు. టీడీపీ పాలనలోనే 70 శాతం ఉపాధ్యాయ నియామకాలు జరిగాయని మండలిలో మంత్రి లోకేష్ సమాధానం ఇచ్చారు. ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ పై శాసన మండలిలో వైసీపీ సభ్యుల ప్రశ్నకు ఈరోజు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువకులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. వారందరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించలేదు. ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదు. దీనిపై వైసీపీ సమాధానం చెప్పాలి. ఉపాధ్యాయ నియామకాల్లో 1994 నుంచి చూస్తే.. 2,60,194 పోస్టులు భర్తీ చేశారు. అందులో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 1,80,272 పోస్టులు భర్తీ చేయడం జరిగింది. ఒక్క టీడీపీ హయాంలోనే 70 శాతం టీచర్ పోస్టులు భర్తీ చేయడం జరిగింది. నేను మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు డీఎస్సీ ఫైల్ పైనే మొదటి సంతకం చేశాను. అందులో భాగంగానే 02-07-24 తేదీన టెట్ నిర్వహించడం జరిగింది. 4.27 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 3.68 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. 1.87 లక్షల మంది అర్హత సాధించారు. 03-10-24 నుంచి 21-10-24 వరకు టెట్ పరీక్షను పూర్తిచేయడం జరిగింది. వర్గీకరణపై వన్ మ్యాన్ కమిషన్ నివేదిక త్వరలోనే రాబోతోందని భావిస్తున్నాం. ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ సభ సాక్షిగా హామీ ఇస్తున్నా. ప్రతిపక్ష పార్టీ నేతలు నా శాఖకు సంబంధించి ప్రశ్నలు వేసి.. చర్చించేందుకు సిద్ధంగా లేరని, ఇది చాలా బాధాకరం. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలి" అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలపై ఆర్బీకే సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ

చిత్తూరు, స్వర్ణసాగరం,మార్చి 04

జిల్లాలో మామిడి పంటల సస్యరక్షణ మరియు ప్రత్యామ్నాయ పంటలపై ఆర్బీకే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జిల్లా ఉద్యానఅధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు.చిత్తూరు జిల్లా నందు మాంగో భవన్ లో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉద్యాన పంటలకు సంబంధిత శాస్త్రవేత్తలతో కలిసి ఆర్బీకే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ... మామిడి కొమ్మల కత్తిరింపు చేపట్టి తెగుళ్లు, పురుగులను సమర్థవంతంగా అరికట్టవచ్చని, పక్వానికి వచ్చిన కాయలను వెంటనే దఫాలుగా కోయడం వల్ల నాణ్యమైన కాయలు మరియు అధిక దిగుబడి లభిస్తుందని తెలిపారు. మామిడి పంటకు సంబంధించి కవర్లను 50 శాతం రైతుతో రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మామిడిలో తేనె మంచు పురుగుకు




సంబంధించి బూప్రోఫెజిన్ లేదా బూప్రోఫేజిన్ తో పాటు ఎసిఫేట్ ల మిశ్రమంతో నివారించవచ్చని, తామర పురుగులు నివారణకు పసుపు రంగు జిగురు అట్ట బుట్టలు చెట్లు అన్నింటికీ ఒకే విధంగా ఉంచడం వల్ల నివారించవచ్చని, పండు ఈగ నివారణకు ఎకరాకు 6 నుంచి 8 బుట్టలు వాడడం వల్ల పురుగులను నివారిం చవచ్చునన్నారుసీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కవిత మాట్లా డుతూ మామిడిలో బూడిద తెగులుకు హెక్సా కొనజోల్ వాడ వల్ల నివారించవచ్చునని, మచ్చ, తెగులు నివారణకు తయోఫినెట్ మిథైల్ పిచికారి చేయడం వల్ల నివారించవచ్చునని తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ మధుమతి మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలైన పామాయిల్, చింత, నిమ్మ సీతాఫలం, కోకో, అవకాడో వంటి పంటల గురించి శిక్షణా తరగతిలో వివరించారు. ఏపీ ఎంఐపి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ డ్రిప్ మరియు స్ప్రింకర్ల వాడటం వల్ల ఉద్యాన పంటలు పండించి అధిక దిగుబడిని పొందవచ్చున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన ఆర్ బి కే సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ జిల్లా లో విస్తృత పర్యటన





రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో అమలు చేసిన మెనూను ఖచ్చితంగా అమలు చేయాలి

పిల్లలకు బాల్యం చాలా ముఖ్యమైన ఘట్టం

: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్

పూతలపట్టు,బంగారు పాల్యం, పెనుమూరు ఎస్ఆర్ పురం,గంగాధర్

నెల్లూరు, స్వర్ణ సాగరం మార్చి 04:

మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాపరెడ్డి చిత్తూరు జిల్లా లో విస్తృత పర్యటన చేశారు.. చిత్తూరు జిల్లా పర్యటన లో భాగంగా పాఠశాలలు, గురుకుల పాఠశాలలు,ఎఫ్ పి షాప్ లు,పి హెచ్ సి లు అంగన్వాడీ కేంద్రాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప రెడ్డి పర్యటించారు. చిత్తూరు జిల్లా లో విస్తృత పర్యటనలో భాగంగా పూతలపట్టు,పెనుమూరు, ఎస్ ఆర్ పురం, గంగాధర నెల్లూరు, బంగారుపాళ్యం మండలాలలోని, ఎఫ్ పి షాప్ లు, అంగన్వాడీ కేంద్రాలు, ఎండియు వాహనాల తనిఖీ,పి హెచ్ సి లు పరిశీలించారు.

గంగాధర నెల్లూరు మండలం లో అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార భద్రత కార్పొరేషన్ చైర్మన్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాల నిర్వహణపై ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్

పిల్లలకు బాల్యం చాలా ముఖ్యమైన ఘట్టమని, చదువు చాలా ముఖ్యమని, చదువుకోవడం వలన వారి జీవితం మెరుగుపడుతుందని అందరూ బాగా చదువుకోవాలని తెలిపారు. పౌర సరఫరాల శాఖ ద్వారా పొందే బియ్యం నాణ్యతను పరిశీలించి, రాష్ట్ర ప్రభుత్వం రేషన్, స్కూల్స్, ఐ సి డి ఎస్ లకు నాణ్యమైన బియ్యం ను అందజేస్తుందని, ఇంట్లో అన్నం వండేటప్పుడు గంజి వంచవద్దని అత్తెసరు పద్ధతిలో అన్నం వండుకోవాలని, ఇలా చేయడం వల్ల ఆహారంలోని పౌష్టికత పుష్కలంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించి మంచి నిర్ణయాలతో పాలు, గుడ్లు, వంటి అధిక విటమిన్, ప్రోటీన్ లు కలిగిన ఆహారాన్ని పిల్లలకు అందిస్తుందని, పిల్లలు ఆరోగ్యంగా ఉంటే చదువులో ముందడుగు వేస్తారని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వారు బాలలకు తొలిదశ నుండే అభివృద్ధి పథం లో నడిపేందుకు పైలట్ ప్రాజెక్టులు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమములో డీఎస్ఓ శంకరన్, డిఎం సివిల్ సప్లై బాలకృష్ణ,జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి,ఐ సి డి ఎస్ అధికారి వెంకటేశ్వరి , సాంఘీక, వెనుకబడిన సంక్షేమ శాఖ డి డి లు చెన్నయ్య, రబ్బానీ భాషా మరియు తదితరులు పాల్గొన్నారు.

# పూతలపట్టు ఆరోగ్య కేంద్రాన్ని .ఫుడ్ కార్పోరేషన్ చైర్మన్ ప్రతాపరెడ్డి ఆకస్మిక తనిఖీ



పూతలపట్టు స్వర్ణ సాగరం మార్చి 4

మంగళవారం ఈరోజు ఉదయం 11 గం.లకు పూతలపట్టు స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని శ్రీ విజయ్ ప్రతాప్ రెడ్డి, స్టేట్ ఫుడ్ కార్పోరేషన్ చైర్మన్ గారు తమ సిబ్బందితో బాటు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పూతలపట్టు ను సందర్శించారు. వీరి వెంట సోషల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు. డాక్టర్ ప్రియాంక ఎంబిబిఎస్ మెడికల్ ఆఫీసర్ మరియు శ్రీనివాస్ మూర్తి కమ్యూనిటీ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ గారు వారిని సాదరంగా ఆహ్వానించారు. గర్భవతులకు, బాలింతలకు అందే పోషకాహారం మరియు వాటి పరిమాణం గురించ ఏఎన్ఎం ఆశా కార్య కర్తలు కు ఎం ఎల్ హెచ్ పి లకు తెలియ చేసారు. వీరి వెంట మండల అధికారులు పాల్గొన్నారు. తదుపరి డాక్టర్ ప్రియాంక ఎంబిబిఎస్ మరియు శ్రీనివాస్ మూర్తి కమ్యూనిటీ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ వారు చైర్మన్ గారిని ఘనంగా సన్మానించారు అలాగే అందరితో కలిసి గ్రూప్ ఫోటో తీసుకున్నారు.

# జాతీయ లైన్ మెన్ దినోత్సవం సందర్భంగా కడూరు లైన్ మెన్ కు ప్రశంసా పత్రం

వరదయ్య పాలెం స్వర్ణ సాగరం మార్చి 04



వరదయ్య పాలెం మండలం లోని కడూరు సచివాలయం పరిధిలోని జూనియర్ లైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న వెట్టి ప్రవీణ్ కుమార్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి విశిష్ట సేవలు అందించినందుకు వెట్టి ప్రవీన్ కుమార్ కు SE సూపరిండెంట్ ఇంజినీర్ సురేంద్ర నాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు .. ఈ కార్యక్రమంలో పుత్తూరు EE దేవాఆశీర్వాదం, నాగలాపురం DEE రమేష్ ,వరదయ్య పాలెం మండలం AE విజయ్ వెంకటేష్ అభినందనలు తెలిపారు....

# “ఏపీ బడ్జెట్ పై శాసనసభలో సోమిరెడ్డి”ప్రశంసల వర్షం గణాంకాలతో వివరణ

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం మార్చ్ 4



రాష్ట్ర శాసనసభలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రాష్ట్ర బడ్జెట్ పై ప్రసంగించి సభను ఆకట్టుకున్నారు.కూటమి ప్రభుత్వం ద్వారా అన్ని రంగాలలో సమతుల్యం పాటిస్తూ బడ్జెట్ కేటాయింపులు జరపడాన్ని ఆయన అభినం దించారు.గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి గల తేడాను తన సహజ గంభీర గణాంకాల విశ్లేషణతో వివరించారు గతంలో ఆయనసీఎం ఈ వై 6 శాఖల మంత్రిగా పనిచేసిన అనుభవం రాష్ట్ర పరిస్థితులపై పూర్తి అవగాహనసీనియర్ నేత కావడంవిశేషం

# ఎన్ ఇ పి 2020 ఓరియంటేషన్ శిక్షణలో పాల్గొన్న భారతదేశ 14 రాష్ట్రాల డైట్ లెక్చరర్లు




ఇందుకూరుపేట స్వర్ణ సాగరం మార్చి 3

ఉదయపూర్ రాజస్థాన్ లో ఫిబ్రవరి 17 నుంచి 28 వరకు 12 రోజులపాటు 499 వఓరియంటేషన్ కోర్స్ నూతన జాతీయ విద్యా విధానం 2020 ఆధారంగా నిర్వహించిన శిక్షణలో భారతదేశానికి చెందిన 14 రాష్ట్రాలప్రభుత్వ డైట్ లెక్చరర్లు పాల్గొన్నట్లు పల్లిపాడు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు

# డా. బిఆర్ అంబేద్కర్ గురుకులాలలో5 వ తరగతి ఇంటర్ మొదటి సంవత్సరం కు దరఖాస్తుల ఆహ్వానం

చివరి తేదీ 6.3.2025

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం మార్చ్ 4

2025 –2026 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో5 వ తరగతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తుల చివరి గడువు ఈనెల6 వ తేదీ అని కోడూరు బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. పేద ఎస్సీ ఎస్టీ బీసీ కులాలకు చెందిన వారు ఈ ప్రవేశ పరీక్షకు అర్హులని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా ఆమె కోరారు

దరఖాస్తుదారులు ఆన్లైన్ ద్వారా ఈ క్రింది వెబ్సైట్ సంప్రదించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా ఇతర విషయాలు తెలుసుకోవచ్చని తెలిపారు

https.apbragcct.apccfs.in

# శ్రీసిటీ-ఐమాప్ పరిశ్రమచే తడ ఐటిఐలో తరగతి గదుల మరమ్మత్తులు, ఆధునీకరణ




శ్రీసిటీ,స్వర్ణ సాగరం మార్చి 04, 2025:

శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐమాప్) పరిశ్రమ తడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అధ్వాన్న స్థితిలో వున్న 3 తరగతి గదులకు మరమ్మత్తులు చేపట్టి ఆధునీకరించింది. తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా 7.5 లక్షల రూపాయలు ఇందుకోసం వెచ్చించింది. మరమ్మతులతో పాటు తరగతి గదుల్లో డెస్కులు, బల్లలు ఏర్పాటు చేశారు. మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీసిటీ డైరెక్టర్ (CSR) నిరీషా సన్నారెడ్డి, ఐమాప్ ఉన్నతాధికారుల సమక్షంలో ఐమాప్ మేనేజింగ్ డైరెక్టర్ టయిజో ఇవామి లాంఛనంగా తరగతి గదులను కళాశాల ప్రిన్సిపాల్ దేవదానంకు అందచేశారు. ఈ సందర్భంగా ఇవామీ మాట్లాడుతూ, స్థానిక విద్యాసంస్థల మౌళిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఐమాప్ మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఐమాప్ చొరవను అభినందించిన నిరీషా, శ్రీసిటీ ప్రత్యేక చొరవకు పరిశ్రమల చురుకైన భాగస్వామ్యం తోడై ఈ ప్రాంతంలోని ప్రభుత్వ విద్యా సంస్థల మౌళిక సదుపాయాలు చాలా వరకు మెరుగుపడ్డాయన్నారు. ఫలితంగా విద్యార్థులు నమోదు శాతం, విద్యా ఫలితాలలో మంచి పురోగతి వచ్చిందని చెప్పారు.కాగా, గడిచిన ఐదు సంవత్సరాలలో శ్రీసిటీ ప్రాంతంలో పలు ప్రభుత్వ విద్యా సంస్థల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర వసతుల కల్పనకు ఐమాప్ సంస్థ తమ సీఎస్సార్ నిధులలో సుమారు కోటి రూపాయలు ఖర్చు చేసింది. ఇది కాకుండా, శ్రీసిటీ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) కు అంబులెన్స్ వితరణ, తిరుపతిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్టీల్ టెస్టింగ్ కోసం యూనివర్సల్ టెస్టింగ్ మెషిన్, మూడు డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటు, జిల్లా అగ్నిమాపక శాఖలో వనరుల పెంపుకు నిధుల సాయం వంటి కార్యక్రమాలు చేపట్టింది.

# కోళ్లు వస్తున్నాయని కాళ్ళు నరికేశాడు

స్వర్ణసాగరం డోర్నకల్ మర్చి 04



సీరోల్ మండలం సుదన పల్లి గ్రామంలో కోళ్ల పంచాయతీతో ఓ వ్యక్తి కాలు నరికిన ఘటన మండల పరిధిలో జరిగింది.సుదనపల్లి గ్రామంలో గత రాత్రి కొండ సోమయ్య పెంపుడు కోళ్లు, సమీపంలోని లింగయ్య ఇంట్లోకి వెళ్లాయి. దీంతో కోపోద్రికుడైన లింగయ్య గొడవపడి గొడ్డలితో సోమయ్య ఎడమ కాలు నరికినట్లు బాధితుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై నగేష్, తెలిపారు.మెరుగైన వైద్యం కోసం జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు

# 31 మందికి రూ.3.10 లక్షలు జరిమానా విధింపు



చిత్తూరు, స్వర్ణసాగరం,మార్చి4

జిల్లా ఎస్పీ వి.ఎన్ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు చిత్తూరు సబ్ డివిజన్ డి.ఎస్పీ టి.సాయినాథ్ ఆద్వర్యంలో చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్య బాబు నిన్నటి దినం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 31 మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో ఈ రోజు ఉదయం ప్రవేశపెట్టగా జడ్జ్ కుమారి ఉమా దేవి వాహనదారులకు 31 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం 3,10,000/- రూ.లు జరిమానా విధించడం జరిగింది.ఈ 1 సం. 2 నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన 799 మందికి సుమారు 79.9 లక్షల రూపాయల ఫైన్ విధించడం జరిగింది.రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లా లోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు తెలిపారు. మద్యం తాగి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరం, ఇది మీ ప్రాణాలకు, ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తుంది.మద్యం సేవించిన వ్యక్తి డ్రైవింగ్ చేయడం పై సెక్షన్ 185 క్రింద మొదటి సారి నేరం చేస్తే రూ. 10,000/- జరిమానా, లేదా 6 నెలల జైలు శిక్ష, లేదా రెండును విధించవచ్చు, రెండవ సారి నేరం చేస్తే రూ.15,000/- లేదా 3 సం.ల జైలు శిక్ష, లేదా రెండును విధించవచ్చునని కావున వాహనం నడిపే సమయంలో వాహనదారులు రోడ్డు భద్రతా మరియు రహదారి నిభందనలు తప్పక పాటించి ప్రమాదాలు, జరిమానాలు, శిక్షలకు గురి కాకుండా ఉండాలని ఇన్స్పెక్టర్ కోరారు.

# మెయిన్ రోడ్ నుంచి సబ్ రోడ్డుకు స్లోప్ అవసరం అన్న జూలియన్ రాజు

రేణిగుంట స్వర్ణ సాగరం మార్చి 04



రేణిగుంట పట్టణంలోని జీఎం స్ట్రీట్ మెయిన్ రోడ్ నుంచి డాక్టర్ బ్రహ్మానందం హాస్పిటల్, తపస్య పాఠశాలకు వెళ్లే సబ్ రోడ్డు స్లోప్ చేయాలని ఆషా సంస్థ అధ్యక్షులు జూలియన్ రాజు పంచాయతీ సెక్రటరీ మణిని కోరారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. జూలియన్ రాజు మాట్లాడుతూ జీఎం స్ట్రీట్ మెయిన్ రోడ్డు హాస్పిటల్, పాఠశాలకు వెళ్లే సబ్ రోడ్డు కన్న ఎత్తు ఎక్కువగా ఉందని స్లోప్ చేయాలని కోరారు. స్కూలుకు వెళ్లే చిన్నపిల్లలు అక్కడ నిత్యం కింద పడుతున్నారని తెలిపారు. పంచాయతీ అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.

స్వర్ణసాగరం



# స్వామివారిని దర్శించుకున్న మాజీమంత్రి ఆర్ కె రోజా



స్వామివారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ సూపర్డెంట్ కోదండపాణి

కాణిపాకం, మార్చి 4 స్వర్ణ సాగరం

స్వామివారిని దర్శించుకున్న మాజీ మంత్రి ఆర్ కె రోజా. మంగళవారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న నగిరి నియోజకవర్గం మాజీ మంత్రి ఆర్ కె రోజా. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం ఏర్పాట్లు చేసి అనంతరం ఆశీర్వాద్ మండపంలో వేద పండితులచే ఆశీర్వాదం చేయించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు, ఈ కార్యక్రమంలో మాజీ కాణిపాకం ఆలయ చైర్మన్ ఏ మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, తదితరులు ఉన్నారు.

# ఐరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మంగళవారం ఆషా డే కార్యక్రమం



ఐరాల, మార్చి స్వర్ణ సాగరం

వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలందరూ తమ పరిధిలో గర్భవతుల ఆరోగ్యం బాలింతల సంరక్షణ చిన్న పిల్లలు టీకాలు మరియు ఆరోగ్యం గురించి చురుకుగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. వడదెబ్బ గురించి అవగాహన కల్పించాలని, ఓఆర్ఎస్ కార్నర్స్ ఏర్పాటు చేయాలని, ఎన్సిడిసిడి 3.0 స్క్రీనింగ్ మార్చి 31 వ తారీకు లోగా సక్రమంగా పూర్తి చేయాలని, క్షేత్రస్థాయిలో ఆరోగ్య సర్వేలు సర్వేలు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. గత నెలలకు సంబంధించి రిపోర్టులను పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమం లో ఆశ కార్యకర్తలు, ఏ.ఎన్.ఎం లు, ఎం. ఎల్.హెచ్. పి లు, సూపర్వైజర్ చిన్నమ్మ, పీ.హెచ్.ఎన్ జీవకలమ్మ, సి.హెచ్. ఓ ఆదిలక్ష్మి మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

# ఏపీ పీజీ సెట్ ను రద్దు చేయండి



స్వర్ణ సాగరం-శ్రీకాళహస్తి

ఏపీపీజీ సెట్ పరీక్షను రద్దు చేయాలంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వానికి సూచించారు. పీజీ సెట్ ను రద్దు చేయాలంటూ స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. పీజీ సెట్ వల్ల ఆయా యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తి తగ్గిపోయి అడ్మిషన్లు పడిపోయే ప్రమాదం ఉందని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు చుట్టు గురవయ్య ఆందోళన వ్యక్తం చేశారు. పీజీ సెట్ నిర్వహణను ఆయా యూనివర్సిటీలకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఫలితంగా అడ్మిషన్లు పెరగడమే కాకుండా పేదలు సైతం ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందని వివరించారు. డేవిడ్, ప్రవల్లిక, కావ్య, ప్రియాంక, యామిని పాల్గొన్నారు.

# ఎండీఎం నిర్వాహకుల పొట్ట కొట్టొద్దు




స్వర్ణసాగరం-శ్రీకాళహస్తి

ఏఎంపుత్తూరు నుంచి మధ్యాహ్న భోజ నం పథకాన్ని నిర్వహి స్తున్న డ్వాక్రా మహిళల పొట్ట కొట్టొద్దని సిఐ టియు నాయకులు సూ చించారు. బాధిత డ్వాక్రా మహిళలతో కలి సి స్థానిక ఆర్డిఓ కార్యాల యం వద్ద మంగళవారం సిఐటియు నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పెనగడం గురవయ్య మాట్లాడుతూ ఏఎంపుత్తూరు వేదికగా 20 మంది డ్వాక్రా మహిళలు పట్టణవ్యాప్తంగా 14 ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలకు మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. 2015లో అప్పటి మంత్రిగా ఉన్న బొజ్జల గోపలకృష్ణారెడ్డి వీరిని సిఫార్సు చేసినట్లు గుర్తు చేశారు. అయితే గత పదేళ్లుగా ఎలాంటి రాజీలేకుండా ఎండీఎం నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళల పొట్ట కొట్టేందుకు శ్రీకాళహస్తి విద్యాశాఖలో పని చేస్తున్న ఎంఈవో స్థాయి వ్యక్తి కుట్ర చేస్తున్నాడంటూ ఆరోపించారు. మామూళ్ల కోసమే ఇదంతానంటూ మండిపడ్డారు. డీఈవో స్పందించి ఆయనపై విచారణ జరపాలన్నారు. డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గంధం మణి, చుట్టు గురవయ్య, వెలివేంద్రం, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక యుగాన్ని ఆందోళనకు గురి చేస్తున్న సైబర్ క్రైమ్ చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.

సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండండి.

చిత్తూరు, స్వర్ణసాగరం, మార్చి4

సైబర్ క్రైమ్ ఆధునిక యుగాన్ని ఆందోళనకు గురి చేస్తోందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు.సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఆన్లైన్ లావాదేవీలకు కూడా దూరంగా ఉండాలని తెలియజేశారు. సైబర్ నేరస్థులు మీ డబ్బు కంటే ముందు మీ మనసును హ్యాక్ చేస్తారని ఆయన హెచ్చరించారు.ఇటీవల సైబర్ మోసాలు పెచ్చు మీరుతున్న నేపథ్యంలో ఢిల్లీ పార్లమెంట్ సమావేశాలలో కూడా ఈ విషయం చర్చకు రావడంతో మంగళవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఢిల్లీలో స్పందించారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో సైబర్ మోసాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. సైబర్ క్రైమ్ మహమ్మారికి ఆజ్యం పోసే మానసిక ఉచ్చులు, హైటెక్ దోపిడీలు, డిజిటల్ మోసాలను బట్టబయలు చేయాలని సూచించారు. డిజిటల్ యుగంలో, సౌలభ్యం రాజుగా ఉన్న ఈ సమయంలో, సైబర్ నేరస్థులుప్రతిదుర్బలత్వాన్ని ఉపయోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని,ఆన్లైన్ షాపింగ్ నుండి బ్యాంకింగ్ వరకు, మన జీవితాలు సాంకేతికతతో లోతుగా ముడిపడి ఉందని తెలియజేశారు. ఇది సైబర్ మోసాన్ని ఎప్పుడూ ఉండే



ముప్పుగా మారుస్తుందని చెప్పిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు.., భారతదేశంలోనే, 1.5 మిలియన్లకు పైగా సైబర్ నేర కేసులు నమోదయ్యాయని వివరించారాయన..వీటిలో 60% ఆర్థిక మోసాల తో ముడిపడి ఉన్నాయనీ అయినప్పటికీ, ఈ గణాంకాల వెనుక నిజమైన వ్యక్తులు కూడా ఉన్నారన్నారనీ ఉదహరించారు.భారతదేశం ఆర్థిక సైబర్ మోసాలకు నిలయంగా మారిందని అంతర్జాతీయంగా వెల్లడైన నేపథ్యంలో, 2023లోనే 1.13 మిలియన్ కేసులు నమోదైన విషయాన్ని భారత ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. దాదాపు 200,000 కేసులతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని, ఆ తర్వాత మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హర్యానాలు ఉన్నాయని లోక్‌సభ ఇచ్చిన సమాధానంలో వెల్లడైందని ఆయన తెలిపారు.డిజిటల్ స్కామ్‌ల లో ప్రధానంగా డబ్బు దొంగతనం జరుగుతుండగా, కొంతమంది బాధితులను లాభదాయకమైన ఉద్యోగ ఆఫర్ల ముసుగులో విదేశాలకు భౌతికంగా రవాణా చేస్తున్నారనీ ఇది డిజిటల్ బానిసత్వం అని పిలువబడే భయంకరమైన వాస్తవమన్నారు. సైబర్ నేరస్థుల అధునాతనత ఆందోళనకరమైన స్థాయికి చేరుకుందని అప్రమత్తత మన గొప్ప రక్షణగా మారిందన్నారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు ప్రధాన లక్ష్యంగా మారుతున్నందున, అవగాహన చాలా కీలకమన్నారు. 2022–2023 ఆర్థిక సంవత్సరంలో యూపీఐ మోసం కేసులు 95,000 దాటాయని, రికవరీ రేట్లు 2% నుండి 8% వరకు తక్కువగా ఉన్నాయని నివేదికలు సూచిస్తున్నాయన్నారు. డిజిటల్ యుద్ధభూమి నేరస్థులకు అనుకూలంగా ఉందనీ, అయితే విజ్ఞతతో వ్యవహరిస్తే డిజిటల్ మోసాలను తిప్పి కొట్టగలమన్నారు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.

# నూతన జాతీయ విద్యా విధానం -2020 పై రాజస్థాన్ లో జరిగిన శిక్షణా విశేషాలను వివరించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు

ఇందుకూరుపేట స్వర్ణ సాగరం మార్చ్ 4

యన్.సి.ఇ.ఆర్.టి కి చెందిన సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ (సీసీఆర్టీ ),ఉదయపూర్,రాజస్తాన్ లో 17-2-2025 నుండి 28-2-2025 వరకు 12 రోజుల పాటు 499 వ ఓరియెంటేషన్ కోర్సు నూతన జాతీయ విద్యా విధానం (యన్.ఇ.పి)–2020 ఆధారంగా జరగగా,ఇందులో భారతదేశానికి చెందిన 14 రాష్ట్రాలకు చెందిన 64 మంది ప్రభుత్వ డైట్ లెక్చరర్లు పాల్గొన్నారనిమండలంలోని పల్లిపాడు డైట్ కళాశాలప్రిన్సిపాల్ కే వెంకటేశ్వరరావు తెలిపారు ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి యస్.సి.ఇ.ఆర్.టి,ఎ.పి ,అమరావతివారిచే ఎంపిక చేయబడిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఇందుకూరుపేట మండలం,పల్లిపాడు డైట్ కు చెందిన ఉపన్యాసకులు కాళిదాసు విజయచంద్ర పాల్గొన్నారని డైట్ ప్రిన్సిపాల్ వారికి అభినందనలు తెలియజేశారు.అలాగే మన రాష్ట్రంలోని కృష్ణా జిల్లా డైట్ కు చెందిన డాక్టర్ పి.టి.జి శ్రీనివాసాచార్యులు,విజయనగరం డైట్ కు చెందిన లుక్కు రామకృష్ణారావు మరియు పశ్చిమ గోదావరి డైట్ కు చెందిన పెండెం దుర్గాప్రసాద్ లు కూడా పాల్గొన్నారని తెలిపారు. వీరు ఆంధ్రప్రదేశ్ కు చెందిన సమగ్ర సమాచారాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివిధ రాష్ట్రాల డెలిగేట్స్ కు వివరించి,ఆంధ్రప్రదేశ్ ప్రాభవాన్ని ఉదయపూర్ వేదికగా చాటిచెప్పి,పలువురి ప్రశంసలు పొందారని పేర్కొన్నారు. అలాగే ఈ ఓరియంటేషన్ కార్యక్రమములో వివిధ రాష్ట్రాలకు చెందిన గవర్నమెంట్ డైట్ లెక్చరర్లు వారి వారి రాష్ట్రాలకు చెందిన కళా సాంస్కృతిక,విద్యా విశేషాలను పీపీటీ ద్వారా,వారి విశేష వేష భాషలతో



వివరించారని,యన్.ఇ.పి–2020లోని కళాసంస్కృతుల అవశ్యకతను చాటిచెప్పారని పేర్కొన్నారు. సంగీతం, నృత్యం, లలిత కళలు మరియు చేతి వృత్తులను విద్యావిధానంలో అంతర్భాగం చేయవలసిన ఆవశ్యకతను అందరూ ఏకగ్రీవ ముగా అంగీకరించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ ములో ప్రముఖ రిటైర్డ్ మరియు వర్కింగ్ ప్రొఫెసర్స్ యన్.ఇ.పి–2020 లోని ముఖ్యాంశాలను తెలియజేయటంతో పాటు, వివిధ జాతీయ గీతాలను,నృత్య ప్రక్రియలను మరియు పెయింటింగ్,పోటరీ తదితర క్రాఫ్ట్ అంశాలు నేర్పించి వాటిని పాఠశాల స్థాయి వరకూ తీసుకొని వెళ్లవలసిన అవశ్యకతను వివరించినట్లు తెలిపారు.అలాగే విద్యార్థులకు బాల్యం నుంచే భారతీయ కళా సాంస్కృతిక అంశాల పట్ల మక్కువ పెంచాలని ఉద్బోధించినట్లు తెలియజేశారు.అట్లే ఆంధ్రా సాంప్రదాయ పిండివంటలు, అహారాలను ప్రాజెక్ట్ రూపములో ప్రజెంటేషన్ చేశారని తెలిపారు.మంగళవారం నిర్వహించిన అభినందన సన్మాన కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు డి.నరసింగరావు,యస్.బి దాస్,కె.షఫీ అహ్మద్,యన్.శివ, కార్యాలయ సూపరింటెండెంట్ యమ్.మేరీ ప్రసూన, కార్యాలయ సిబ్బంది,ఛాత్రోపా ధ్యాయులు పాల్గొన్నారు.

# వేగవంతంగా ధాన్యం చెల్లింపులు

రైతుకు సన్మానంజాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు స్వర్ణ సాగరం మార్చి 4



పొదలకూరు పిఎసిఎస్ పరిధిలోని తాటిపర్తి ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల వ్యవధిలోనే ప్రభుత్వం నగదు చెల్లించడం జరుగు తుందని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు.. ఈ నెల 2 వ తేదీన తాటిపర్తి ధాన్యం కొనుగోలు కేంద్రం నందు బిజ్జం రమణా రెడ్డి అనే రైతు తన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించారనీ.గడచిన 24 నుండి 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో పౌర సరఫరాల శాఖ నుంచి రు.4.53 లక్షల నగదు జమ చేసిందనీ తెలిపారు.డిసిఒ గుర్రప్ప మాట్లాడుతూ సత్వరమే రైతుల ఖాతాలలో డబ్బు జమ చేయడం తో సంతోషం వ్యక్తం చేస్తున్నారని, పొదలకూరు సంఘ సి ఇ ఓ కె. రాధాకృష్ణ రెడ్డి మరియు గ్రామ వి ఏ ఏ ఆధ్వర్యంలో రైతును సన్మానించినట్లు తెలిపారు.

# కాణిపాకం గణనాధుని సేవలో తిరుమల వన్ టౌన్ ఎస్ఐ చలపతి



కాణిపాకం ,మార్చి 4 స్వర్ణ సాగరం

గణనాథుని సేవలు తిరుమల వన్ టౌన్ ఎస్ఐ చలపతి. మంగళవారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న తిరుమలవంటం ఎస్సై చలపతి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వాదం అందుకొని అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందుకున్నారు, ఈ కార్యక్రమంలో కాణిపాకం ఎస్ఐ ధరణిధర్, పులికల్లు పూర్ణచంద్రారెడ్డి, వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర సమరయోధురాలు పొణకా కనకమ్మ, దువ్వూరి రామిరెడ్డి జయంతి వేడుకలు



నెల్లూరు స్వర్ణ సాగరం మార్చి 4

సమాజమే దేవాలయం, నాకు ఉన్నదంతా సమాజం కోసమే అని తన జీవితాన్ని నిస్వార్థంగా సమాజం కోసంఅంకితం చేసిన పొణకా కనకమ్మ, కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి జయంతి ఉత్సవాలు అబిడ్స్ లోనిరాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి భవనంలో శ్రీమతి పొణకా కనకమ్మ ఆశయ సాధన సమితి, కవి కోకిల రామిరెడ్డి విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో మంగళవారంఘనంగా నిర్వహించారు. ప్రముఖ పాత్రికేయులు పాశం యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖరైతు నాయకులు వడ్డే శోభనాదీశ్వరరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు మేకపాటి రామ్మోహన్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రముఖ జానపద గాయకుడు గోరేటి వెంకన్న హాజరై పొణకా కనకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన జీవితమంతా బాలికల అక్షరాస్యత కోసం, కుల మతాలను రూపుమాపడానికి తమ కుటుంబ సభ్యుల ఆస్తితోపాటు తనకున్న ఆస్తి నంత సమాజం కోసం దానం చేసిన గొప్ప మమతామూర్తిపొణకా కనకమ్మ అని కీర్తించారు. మహాత్మ గాంధీ ఇంకాస్వాతంత్ర ఉద్యమంలోకి అడుగుపెట్టకు ముందు నుండిసమాజ హితం కోరి సమాజ సేవ అనే తన భావజాలాన్ని తనదైన శైలి లో సమాజాన్ని ప్రభావితం చేసిన పొణకా కనకమ్మ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందనికొనియాడారు. సమాజంలో వివిధ రంగాల్లో తమ వంతు కృషి చేసిన పలువురు ప్రజ్ఞావంతులను ఈ సందర్భంగా సత్కరించి వారికి 25వేల రూపాయల నగదు బహుమానం అందించారు. ఈ కార్యక్రమం సందర్భంగా గోరేటి వెంకన్న తన పాటతో సభను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమాన్ని వేమారెడ్డి ప్రభాకర్ రెడ్డి, కొండ లక్ష్మీకాంత్ రెడ్డి, చలంచర్ల భాస్కర్ రెడ్డి, బిఎస్ఎన్ రెడ్డి, పెల్లేటి సుబ్రహ్మణ్య రెడ్డి నిర్వహించడం జరిగింది.

# 6న అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ముఖ్యఅతిథిగా టిడిపి మండలాధ్యక్షుడు రావెళ్ళ రాక

ఇందుకూరుపేట స్వర్ణ సాగరం మార్చి 4

మండలంలోని ఆయా ఉన్నత పాఠశాలల ద్వారా పదవ తరగతి పబ్లిక్ పరీక్షకు హాజరవుతున్న 418 మంది విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ముదివర్తిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో 6 వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకుమెటీరియల్ కిట్ పంపిణీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దొడ్ల మల్లికార్జున తెలిపారు

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సహాయ సహకారాలతో తమ ట్రస్ట్ పనిచేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి మండలాధ్యక్షులు రావెళ్ల వీరేంద్ర నాయుడు ఎం ఈ ఓ సునీల్ కుమార్ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు

# మంచి బువ్వ పెడితే 'పొట్ట కొట్టే' కుట్ర

## ఎంఈవో స్థాయి అధికారిపై డీఈఓకు ఫిర్యాదు

## న్యాయం చేయాలంటున్న ఎండీఎం నిర్వాహకులు

స్వర్ణసాగరం-శ్రీకాళహస్తి

ఒక పాఠశాలతో మొదలైన వారి ప్రస్థానం అనతికాలంలోనే పదహారుకు చేరింది. ' మా పాఠశాలకూ మీరే భోజనం సరఫరా చేయండి ప్లీజ్' అంటూ పెద్ద సంఖ్యలో ఫెరెంట్స్ కమిటీలతో పాటు ప్రధానోపాధ్యాయుల నుంచి ప్రతిపాదనలు వెల్లువెత్తాయి. కష్టమే అయినా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతోంది మనలాంటి పేదింటి బిడ్డలే కదాని ఒప్పుకున్నారు. ఒప్పుకోవడమే కాదు లాభాపేక్ష లేకుండా మధ్యాహ్న భోజన నాణ్యతలో రాజీ పడకుండా పౌష్టికాహారాన్ని సరఫరా చేశారు. కలెక్టర్, డీఈవో నుంచి సామాన్యుల దాకా ప్రశంసలందుకున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకున్న శ్రీకాళహస్తిలోని పలు ఎండీఎం ఏజెన్సీలు భోజన నాణ్యతను పెంచక తప్పలేదు. ఇదీ ఏఎం పుత్తూరు వేదికగా ఎండీఎం నడుపుతున్న డ్వాక్రా మహిళల స్ఫూర్తిదాయక గాథ. అయితే వీరినుంచీ మామూళ్లు ఆశించిన శ్రీకాళహస్తి విద్యాశాఖలోని ఓ ఎంఈవో స్థాయి అధికారికి ఆశాభంగం కలగడంతో డ్వాక్రా మహిళలపై పగబట్టాడు. తన సమీప బంధువుకు ఎండీఎం ఏజెన్సీని అప్పగించేందుకు కొందరు అధికారపార్టీ నేతలతో చేతులు కలిపాడు. దీంతో తమ పొట్ట కొట్టద్దనీ, మరీ ముఖ్యంగా కమీషన్లకు కక్కుర్తిపడి పేద విద్యార్థులకందాల్సిన పౌష్టికాహారాన్ని దూరం చేయద్దని జిల్లా విద్యాశాఖాధికారికి డ్వాక్రా మహిళలు ఫిర్యాదు చేశారు.

వివరాల్లోకి పోతే...శ్రీకాళహస్తి పట్టణంలోని ఏఎం పుత్తూరు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వేదికగా ఇద్దరు డ్వాక్రా మహిళలు 2015లో మధ్యాహ్న భోజన నిర్వహణా బాధ్యతలను తీసుకున్నారు. వారు విద్యార్థులకందజేస్తున్న భోజన నాణ్యత గూర్చి పట్టణమంతా చర్చ నడవడంతో పలు ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో ఎండీఎం నిర్వహణకు వీరికి ప్రతిపాదనలు వచ్చాయి. 16 పాఠశాలల్లో సుమారు 2 వేల మంది విద్యార్థులకు 20 మంది డ్వాక్రా మహిళలు ఏఎంపుత్తూరు వేదికగా మధ్యాహ్న భోజనం వండి పంపేవారు. భోజన నాణ్యతలో డ్వాక్రా మహిళలు ఎలాంటి రాజీ పడకపోవడంతో వీరంతా విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్నారు. జిల్లా కలెక్టర్ సైతం వీరి నిబద్ధతను మెచ్చి ఉత్తమ ఎండీఎంగా ప్రశంసా పత్రం కూడా అందజేశారు. దాదాపు పదేళ్లుగా ఎండీఎం పథకంలో తమ స్వలాభాన్ని పక్కనపెట్టి, కేవలం ఉపాధిని మాత్రమే ఆశిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమంటే మాటలు కాదు. అలాంటి మాపై తప్పుడు ఆరోపణలు చేస్తూ శ్రీకాళహస్తి విద్యాశాఖలో పనిచేస్తున్న ఓ ఎంఈవో స్థాయి అధికారి తమ ఏజెన్సీని లాక్కునే ప్రయత్నం చేస్తున్నాడని డ్వాక్రా మహిళలు మండిపడుతున్నారు. ఇప్పటికే తమ వద్ద నుంచి మూడు పాఠశాలలు లాగేసుకున్నారనీ, మిగిలిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కూడా బెదిరించి గుంజుకునేందుకు కుట్ర చేస్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో పాఠశాల నుంచి రూ.10 వేలు మామూలు ఇవ్వాలనీ, కోడిగుడ్లు, బియ్యం, రాగి పిండి నెలనెలా పంపాలని బెదిరిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఎండీఎంపై ఆధారపడి మా ఇరవైమందితో కలిపి మరో ఇరవై మంది మహిళలు ఉపాధి పొందుతున్నారనీ, ఆ అవినీతి అధికారి వల్ల నలభై మంది డ్వాక్రా మహిళలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఆయనపై తగు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నారు.



## ఇష్టపడే చదివితే ఉత్తమ ఫలితాలు

## డాక్టర్ యల్లంపాటి కోటేశ్వర బాబు



స్వర్ణ సాగరం -శ్రీకాళహస్తి

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని సంఘ సేవకులు, శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ వై. కోటేశ్వర బాబు అన్నారు. మంగళవారం మండలంలోని బండారుపల్లి, మునగల పాలెం, ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే 83 మంది విద్యార్థిని, విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుల ద్వారానే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి, విద్యార్థిని రానున్న పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బండారుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మల్ కుమార్, మునగల పాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ వేలు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అధ్యక్షులను కలిసిన తెదేపా నేతలు



పెళ్లకూరు స్వర్ణసాగరం మార్చ్ 4.

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుని సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మండలానికి చెందిన ఆపార్టీ నాయకులు మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మండలంలో ఉన్న తాజా రాజకీయ విశేషాలను వారితో చర్చించారు. ప్రభుత్వం ఇస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య, రాష్ట్ర సర్పంచ్ ల సంఘం కార్యానిర్వాహక కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్ర రెడ్డి, స్వర్ణముఖి ఆనికట్టు చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, టీడీపీ నాయకులు మురళి నాయుడు, మదన్ మోహన్ నాయుడు తదితరులు ఉన్నారు.

## కాణిపాకం స్వామివారిని దర్శించుకున్న ఆలయ పునర్నిర్మాణ వెండి వాకిలి బంగారు వాకిలి నిర్మాణదాత గుత్తికొండ శ్రీనివాస్ యు ఎస్ ఏ



కాణిపాకం ,మార్చి 4 స్వర్ణ సాగరం

స్వామివారిని దర్శించుకున్న ఆలయ పునర్నిర్మాణ మరియు వెండి వాకిలి బంగారు వాకిలి నిర్మాణ దాత గుత్తికొండ శ్రీనివాస్ యూఎస్ఏ.కాణిపాకం శ్రీ వరసిద్ధి స్వామివారిని దర్శించుకున్న ఆలయ పునర్నిర్మాణ, మరియు వెండి వాకిలి, బంగారు వాకిలి నిర్మాణ దాత గుత్తికొండ శ్రీనివాస్ , యు ఎస్ ఎ వారు స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, దేవస్థానం మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఫుడ్ కమిషనర్ విజయ ప్రతాప్ రెడ్డి



బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.మార్చి 4

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను జిల్లా ఫుడ్ కమిషనర్ విజయ ప్రతాప్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో గల స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, కిచెన్, బాత్రూంలను పరిశీలించి పరిసరాలను విజిట్ చేసి, పిల్లలకు క్వాలిటి రైస్ ఎలా అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వాడే వస్తువులు బ్రాండెడ్ వస్తువులు వాడుతున్నారా లేదా అని ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య ను అడిగి తెలుసుకోవడం జరిగింది. పిల్లలు మంచి చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పిల్లల పట్ల కాసేపు సరదాగా గడిపారు. హాస్టల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా జాగ్రత్తలు వహించాలని ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్యకు సూచించారు. పాఠశాలలోని రిజిస్టర్ లను తనిఖీ చేసి అన్ని రికార్డ్స్ సక్రమంగా ఉండడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కోకిల, పాఠశాల సిబ్బంది అనిత, శ్యామల, సుకన్య, ప్రసన్న, పీఈటి రాజేష్ కుమార్, వంట మాస్టర్ చంద్ర తదితరులు పాల్గొన్నారు

## త్రాగునీటి సమస్య పరిష్కారమే ముఖ్య ధ్యేయం



గుడిపాల స్వర్ణ సాగరం మార్చ్ 4

గుడిపాల మండల పరిధిలో త్రాగునీటి సమస్య ఏ గ్రామంలో ఏర్పడిన వాటిని పరిష్కరించడమే ముఖ్య ద్వేయమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తండ్రి జిజేయం ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు అన్నారు మంగళవారం మండలంలోని రామభద్రపురం పంచాయతీ ముట్టుకురపల్లి గ్రామంలో ప్రజల దాహార్తి తీర్చడం కోసం నూతన బోరును డ్రిల్ చేశారు ఈ సందర్భంగా నూతన బోరును ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చిత్తూర్ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పనిచేస్తున్నారని ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్న ఎమ్మెల్యే దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు ఉపసర్పంచ్ సరళ గ్రామస్తులు సాంబశివ నాయుడు ఈశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ అభయ హస్త ఆంజనేయ స్వామి ఆలయంలో 7వ వార్షిక మహోత్సవం



రేణిగుంట స్వర్ణ సాగరం మార్చి 04

రేణిగుంట మండలం తారకరామ నగర్ లో శ్రీ అభయ హస్త ఆంజనేయ స్వామికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు పూల అలంకరణలతో ఆంజనేయస్వామి కి గ్రామ ప్రజలు సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆంజనేయస్వామి కి భక్తులు చాలామంది విచ్చేశారు. అంగరంగ వైభవంగా శ్రీ అభయ హస్త ఆంజనేయ స్వామి ఏడవ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమం శ్రీ అభయహస్త ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

# పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి

## కాంగ్రెస్ ప్రభుత్వం పై తమ పోరాటం ఆగబోదని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ స్వష్టీకరణ



తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి మార్చి 04 : పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని, అలాకాకుండా చేయి పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన తీరును నిరసిస్తూ నల్గొండ జిల్లా చండూరులో చెప్పుల దండలు మెడలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం వికలాంగులు వినూత్న నిరసన తెలిపారు ఈ సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడిన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ తెలంగాణ రాష్ట్రంలో 30 లక్షల మంది వికలాంగులు అనేక సమస్యలతో అల్లాడిపోతుంటే వికలాంగుల ఓట్లతో ముఖ్యమంత్రిగా గద్దెనెక్కిన చేయి పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగుల సంక్షేమాన్ని అడుగడుగున విస్మరిస్తున్నారని ముఖ్యంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు పిసిసి అధ్యక్షుని హెూదాలో తమ పార్టీ అధికారంలోకి వస్తే అదే నెల నుంచి వికలాంగుల పింఛన్లు 6 వేల పెంచుతామని, ఆర్టీసీలో వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి వేరుచేసి, ప్రత్యేక శాఖగా కొనసాగించడంతో పాటు ప్రత్యేక అధికారులను నియమిస్తామని, రాష్ట్రంలో వికలాంగుల అట్రాసిటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని, రాష్ట్రంలో వికలాంగుల బ్యాక్ లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ముఖ్యంగా తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తామని అనేక హామీలు ఇచ్చి తెలంగాణలో బలమైన శక్తిగా ఉన్న వికలాంగుల ఓట్లను కొల్లగొట్టి అధికారంలోకి వచ్చిన చేయి పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 14 నెలలు గడుస్తున్న ఎన్నికల ముందు వికలాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా వికలాంగుల సమాజంపై వివక్షను ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా తమ వికలాంగుల సామాజిక వర్గం ఓట్లను ఎన్నికల సమయంలో వేయించుకొని ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, మండల పరిషత్ అధ్యక్షులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, సర్పంచులు, వార్డు మెంబర్లుగా ఎన్నికవుతున్న సకలాంగుల ప్రజాప్రతిని ధులు తమ వికలాంగుల సంక్షేమం గురించి తమ అభివృద్ధి గురించి విసుమంత అయినా ఆలోచన చేయకుండా చట్టసభల్లో తమ సమస్యలపై చర్చించకుండా ఉంటున్న తీరు కారణంగానే తాము చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్ సాధనకై ఉద్యమించవలసిన పరిస్థితులు దాపరించాయని ముఖ్యంగా 78 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో రాజ్యాధికారానికి దూరమై సకలాంగుల పాలకుల చేతుల్లో సంక్షేమం కుంటుబడిన ఏకైక సామాజిక వర్గం తమ వికలాంగుల సామాజిక వర్గమని అలాంటి మా వికలాంగుల సామాజిక వర్గానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయి పార్టీ ఏఐసీసీ ఎన్నికల మేనిఫెస్టోలో పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి నేడు ఆ హామీని నెరవేర్చకుండానే పంచాయతీ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న చేయి పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన తీరును నిరసిస్తూ పంచాయతీ ఎన్నికల్లో తమ వికలాంగుల రిజర్వేషన్ తేల్చాలని అసెంబ్లీ ఎన్నికల్లో తమ వికలాంగుల సమాజానికి హామీ ఇచ్చిన మేరకు వెంటనే 6 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని, ఆర్టీసీలో 100% ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు వికలాంగుల సమాజానికి ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈరోజు చండూరులో చెప్పులు మెడలో వేసుకొని తమ భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి నిరసన వ్యక్తం చేసింది తెలిపిన ఆయన పంచాయతీ ఎన్నికల్లో వికలాంగుల రిజర్వేషన్ తేల్చేంతవరకు చేయి పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంఘం చెండూరు మండలం అధ్యక్షులు ఆకారపు వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు గుడిపల్లి సుమతి, సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు చిన్నపాక మత్స్యగిరి, సంఘం జిల్లా మహిళా నాయకురాలు గుండెబోయిన అలివేలు, సంఘం మండల మహిళా అధ్యక్షురాలు కారంగుల రేణుక, సంఘం చండూరు మండలం ఉపాధ్యక్షులు పల్లగొని రవి, సంఘం చండూరు మండలం యూత్ అధ్యక్షులు శ్రీకాంత్, సంఘం మునుగోడు మండల అధ్యక్షులు తలారి సహదేవుడు, మునుగోడు మండల ఉపాధ్యక్షులు ఒంటెపాక ముత్తయ్య, సంఘం నాయకులు సిద్ధు, శివకుమార్, కృష్ణయ్య, శైలజ, కళావతి, నాగమణి, నాగమ్మ, గోవర్ధన్ రెడ్డి, ఈదా పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా ట్రాక్టర్లను పంపిణీ చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ




## ప్రజా భాగస్వామ్యం ద్వారానే పరిసరాల పరిశుభ్రత సాధ్యం

### సిడిపిఓ భారతి ఆధ్వర్యంలో స్టాల్స్ ను పరిశీలించిన గొట్టిపాటి లక్ష్మి

దర్శి, స్వర్ణ సాగరం, మార్చి 04 :

స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా మంజూరైన నాలుగు గ్రామ పంచాయతీలకు చెత్త తరలింపు ట్రాక్టర్లను మంగళవారం దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తాళ్లూరు మండల పరిషత్ కార్యాలయము నందు ఆమె చేతుల మీదుగా శివరాంపురం, నాగం బొట్లపాలెం, బొద్దుగూరపాడు, లక్కవరం గ్రామ పంచాయతీ లకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ మన ఊరు మనం బాగు చేసుకుందాం అనే చైతన్యం ప్రతి ఒక్కరిలో రేకెత్తించే కార్యక్రమంలో భాగంగా మన కూటమి ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ అనే ఓ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది అని ఆమె అన్నారు. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనల లో భాగంగా మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నిర్వహణలో చేయి చేయి కలుపుదాం మన ఊరు మనం శుభ్రం చేసుకుందాం అనే కార్యక్రమాన్ని చేపట్టాం. ప్రతినెల మూడవ శనివారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం, అంతే కాక మండల కేంద్రాలు, పెద్ద పెద్ద గ్రామాలలో కూడా చెత్తను పేరుకుపోనికుండా చెత్త తరలింపు ట్రాక్టర్లను స్వచ్ఛ కార్పోరేషన్ మిషన్ ద్వారా ఉచితంగా అందజేస్తున్నాం అని అన్నారు. ప్రతి గ్రామాన్ని యూనిట్ గా తీసుకొని మన ఊరు మనం బాగు చేసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం అని అన్నారు. గత వారంలో దర్శి పట్టణంలో ఒక మహోన్నత కార్యక్రమాన్ని చేపట్టి పార్కు అభివృద్ధి చేసి చూపించాం, ప్రజా భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు తరలి వచ్చి పార్కు బాగు చేసుకునే కార్యక్రమంలో నాతో పాటు భాగస్వాములు అవ్వడం నాకెంతో స్ఫూర్తినిచ్చింది అని అన్నారు. అదే స్ఫూర్తితో ప్రతి గ్రామంలో యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థలు మన ఊరు మనం బాగు చేసుకుందాం అనే కార్యక్రమానికి ముందుకు రావాలని డాక్టర్ లక్ష్మీ పిలుపునిచ్చారు. మన కూటమి ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలకు మనమందరం చేదోడు వాదోడుగా నిలవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే ఈ చెత్త తరలింపు ట్రాక్టర్లను సక్రమంగా సద్వినియోగం చేసుకొని ప్రతి గ్రామం క్లీన్ అండ్ గ్రీన్ గా మార్చుకోవాలని తద్వారా పరిసరాలు పరిశుభ్రమై ప్రజా ఆరోగ్యానికి దోహదపడుతుందని ఆమె కోరారు. ఒక డాక్టర్ గా పరిశుభ్రం ద్వారానే ఆరోగ్యం సాధ్యమవుతుందని నాకు తెలుసు అన్నారు. మన నాయకులు కూడా అదే స్తుతులు తీసుకొని ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ స్వచ్ఛత కోసం ఇలాంటి మంచి కార్యక్రమాలను చేపట్టడం శుభ పరిణామం అని ఆమె అన్నారు. దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా మార్చుకునేందుకు ప్రజలందరి భాగస్వామ్యం అవసరమని ఆమె కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ ఎనిమిది నెలల కాలంలో అనేక ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి నిరుద్యోగ యువతకు ఊతమిస్తూ ఆంధ్ర రాష్ట్ర పునర్నిర్మాణానికి బాటలు వేస్తున్నామని డాక్టర్ లక్ష్మీ వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, తాళ్లూరు మండల టిడిపి అధ్యక్షులు బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి, తాళ్లూరు ఇంచార్జ్ ఎంపీడీవో హనుమంతరావు, తాళ్లూరు తహాశీల్దార్ ఇమ్మానియేల్, పంచాయితీల సెక్రటరీలు, అధికారులు, నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న టిడిపి సీనియర్ నాయకులు శాగం కొండారెడ్డి, మానం రమేష్ బాబు, మేడగం వెంకటేశ్వర రెడ్డి, పిన్నిక రమేష్ బాబు, ఇడమకంట శ్రీనివాస రెడ్డి, కైపు. రామకోటిరెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, రాచకొండ వెంకట్రావు, కైపు నాగార్జున రెడ్డి, గొల్లపూడి వేణుబాబు, తురకపాలెం సర్పంచ్, కొర్రపాటివారి పాలెం సర్పంచ్ కొర్రపాటి శ్రీదేవి – రామయ్య, తదితర నాయకులు, మహిళలు, మరియు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. తదుపరి సి డి పి ఓ భారతి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు, డ్వాక్రా గ్రోప్ మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పరిశీలించటం జరిగినది.

## నియోజకవర్గ మహిళలకు ముందుగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు




### మన నారీ లోకం శక్తి మహోన్నతమైనది... డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, స్వర్ణ సాగరం, మార్చి 04:

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నియోజకవర్గ ప్రజలకు ముందుగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నారని, ఇంకా అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. మాలాంటి మహిళా డాక్టర్లు సమాజంలో గౌరవప్రదంగా ఉన్నారన్నారు. ఈరోజు మనం డాక్టర్లను చూస్తే మహిళలే ఎక్కువ మంది వైద్య వృత్తి వైపు పయనిస్తున్నారన్నారు అని అన్నారు. అదే విధంగా సాఫ్ట్ వేర్ రంగంలో, ఇతర సాంకేతిక రంగాలలో మహిళలు పురుషులతో పోటీపడి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారు అని అన్నారు. క్రీడలలో పీవీ సింధు వంటి అనేక మంది ప్రపంచంలో గుర్తింపు పొందారన్నారు. మన కూటమి ప్రభుత్వం కూడా మహిళల ఆర్థిక అభివృద్ధికి వారి నైపుణ్యతకు ఎంతో సహకరిస్తుంది అన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇస్తూ వారిని ఆర్థిక శక్తిగా ఎదిగే విధంగా కుటుంబంలో మహిళల గౌరవాన్ని పెంచేందుకు కృషి జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కృషితో మహిళల అభివృద్ధికి అనేక పథకాలను ముందుకు తీసుకెళ్లగలుగుతున్నాం అన్నారు. వారు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వపరంగా అండదండ గా ఉంటున్నాం అన్నారు. ఇలా మన కూటమి ప్రభుత్వం మహిళల భద్రత, రక్షణ తో పాటు ఆర్థిక అభివృద్ధికి నైపుణ్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని గొట్టిపాటి లక్ష్మీ వివరించారు.

## లింగ వివక్షత చూపరాదు సిడిపిఓ సరోజినీ

కనిగిరి స్వర్ణ సాగరం, మార్చి 4:



లింగ వివక్షత మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి మహిళా దినోత్సవం ఒక వేదికగా పనిచేస్తుందని కనిగిరి సిడిపిఓ సరోజినీ అన్నారు. మహిళా దినోత్సవ పురస్కరించుకొని మంగళవారం హెల్దీ ప్రెగ్నెంట్ వాళ్లకు శ్రీమంతాలు చేసి, హెల్దీ ప్రెగ్నెంట్ హెల్దీ ప్లేట్స్ కార్యక్రమాన్ని కనిగిరి సిడిపిఓ సరోజినీ ప్రారంభించారు. అనంతరం అంగనవాడి కార్యకర్తలచే గర్భవతులతో యోగాడే నిర్వహించార. ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడానికి యోగా సహాయపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ సుమతి కనిగిరి సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జంబులబండ లో నీటి సమస్య తీర్చండి మహాప్రభో



గుడిబండ స్వర్ణ సాగరం మార్చి 04:

మండల పరిధిలోని జంబులబండ గ్రామం నందు నీటి సమస్యతో మహిళలు రోడ్డెక్కిన పరిస్థితి సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎన్నోసార్లు స్థానిక శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు మరియు శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి మన పంచాయతీ పర్యటన కు వచ్చినప్పుడు ఎక్కడ త్రాగునీటి సమస్య అనేది ఉండకూడదని సూచించిన కూడా అధికారులు నిర్లక్ష్య వైఖరిని చూపుతున్నారని వారు వాపోయారు. జంబులబండ గ్రామ బస్టాండ్ లో మడకశిర రోడ్డు ప్రధాన కూడలిలో గ్రామస్తులంతా కలిసి రోడ్డుపై కాలి బిందెలతో బైఠాయించారు. అనంతరం వారు మాట్లాడుతూ బోర్లు తవ్వించడం లేక మోటారు పంపు తేవడం లేక బోరు బావికి విద్యుత్ మరమ్మత్తు సాకుతోనే గత మూడు నెలలుగా నీటి సమస్యను ఎదుర్కొంటున్నామని, ఎన్నోసార్లు పంచాయితీ అధికారులను ప్రజాప్రతినిధులను వేడుకొన్న కనికరించని పరిస్థితి నెలకొందని బాధితులు వాపోతున్నారు. నీళ్ల అత్యవసర పరిస్థితిని కనీసం త్రాగడానికి కూడా నీళ్లు లేక రైతుల బోరు బావిలో చుట్టూ తిరుగుతున్నామని, వారు విన్నవించారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే అధికారుల కార్యాలయాలను గ్రామస్తులందరూ కలిసి ముట్టడి చేస్తామని వారు హెచ్చరించారు.

## కొత్తగా నిర్మిస్తున్న ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రిని పరిశీలించినా వైస్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ రెడ్డి



మడకశిర స్వర్ణ సాగరం మార్చి 04

మడకశిర మండలం నీలకంఠాపురం గ్రామంలో మాజీ మంత్రి సి డబ్ల్యూ సి మెంబర్ రఘువీరారెడ్డి వారి కుటుంబ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రిని ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైస్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ రెడ్డి సందర్శించారు. మంగళవారం సాయంత్రం నీలకంఠాపురం గ్రామానికి వెళ్లి నిర్మాణంలో ఉన్న ఆసుపత్రిని పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా ఆసుపత్రి నిర్మాణం పూర్తవుతుందని తెలియజేశారు. త్వరలోనే ఈ గ్రామంలో కంటి ఆసుపత్రిని ప్రారంభిస్తున్నామని తెలిపారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆసుపత్రి పని చేస్తుందని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యంతో తక్కువ ఖర్చులతో అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని నీలకంఠాపురం గ్రామంలో ప్రారంభిస్తున్నట్లు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైస్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ రెడ్డి తెలిపారు.

ప్రకాశం
ఒంగోలు గుంటూరు శ్రీసత్యసాయి
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9966555303

## మృతిచెందిన టిడిపి కార్యకర్తను పరామర్శించిన గొట్టిపాటి లక్ష్మి, కడియాల లలిత్ సాగర్

కురిచేడు, స్వర్ణ సాగరం, మార్చి 04:



కురిచేడు మండలం, అగ్రహారం గ్రామంలో అనారోగ్య కారణంగా మృతి చెందిన టిడిపి నాయకుడు తాటి వెంకటేశ్వర్లు పార్థివ దేహానికి దర్శి నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్ లు పూలమాల వేసి నివాళులర్పించినారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ఎల్లప్పుడూ పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కురిచేడు మండల పార్టీ అధ్యక్షులు పిడతల. నెమలయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కాట్రాజు నాగరాజు మరియు గ్రామంలోని నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు వేగవంతంగా ప్రభుత్వ సేవలను అందించండి



– ఆర్డిఓ ఆనందకుమార్

అమరాపురం స్వర్ణ సాగరం మార్చి 4

మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో పెనుకొండ ఆర్డిఓ ఆనంద్ కుమార్ మంగళవారం తహసిల్దార్ లక్ష్మీనరసింహ, ఎంపీడీవో రామారావు, మండల సర్వేయర్ పుట్టరాజు తోపాటు గ్రామ సర్వే అసిస్టెంట్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను వేగవంతంగా ప్రజలకు అందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పి. ఫోర్ సర్వే, వర్క్ ఫ్రం హోం, రైతులకు యూనిక్ ఐడీలు, ఫ్రీ హోల్డ్, రీ సర్వే తదితర కార్యక్రమాలపై చర్చించారు. అదేవిధంగా మండలంలో మోటేషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి కృషి చేస్తామని ఆర్డిఓ విలేకరులకు తెలియజేశారు. రెవిన్యూ పరమైన సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కూడా కృషి చేయడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## ఆశా కార్యకర్తల డిమాండ్లను పరిష్కరించాలని వినతి పత్రం అందజేసిన ఆశ కార్యకర్తలు



మడకశిర స్వర్ణ సాగరం మార్చి 4

మండలంలో పనిచేస్తున్న ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ పిహెచ్సి డాక్టర్ శ్రీనివాసులకు మంగళవారం ఆశ కార్యకర్తలు వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి జిల్లా ఆశా కార్యకర్తల యూనియన్ అధ్యక్షురాలు సౌభాగ్యమ్మతో పాటు పలువురు ఆశా కార్యకర్తలు ప్రభుత్వ పిహెచ్సి ఆసుపత్రికి వెళ్లి డాక్టర్ శ్రీనివాసులకు వినితిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతనం అమలుపరిచి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం వర్తింపజేసే విదంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల ఆరవ తారీఖున విజయవాడలో మహాధర్నాను చేపడుతున్నట్లు యూనియన్ అధ్యక్షురాలు సౌభాగ్యమ్మ తెలిపారు.

## ట్రాక్టర్ లను పంపిణీ చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



కురిచేడు, స్వర్ణ సాగరం, మార్చి 04:

కురిచేడు ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా ఆవులమంద గ్రామానికి ట్రాక్టర్ లను మంజూరు చేయగా, మంగళవారం ట్రాక్టర్ లను దర్శి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ లలిత్ సాగర్, ఎంపీడీవో సతీష్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు పిడతల నేములయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజు, మాజీ ఎంపీపీ గడ్డం బాలయ్య, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ మొగల్ మస్తాన్వలి, మాజీ డిసి చైర్మన్ పావులూరి కోటి లింగయ్య, మాజీ నీటి సంఘం అధ్యక్షులు గొట్టిపాటి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు కాశి, గొట్టిపాటి రామయ్య, నక్క కోటి వీరయ్య, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చాటిన సింగన్నపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థినిలు






ఒంగోలు, స్వర్ణ సాగరం, మార్చి 04:

ఒంగోలులో జరిగిన ప్రకాశం జిల్లా బాలోత్సవంలో కట్ట సింగన్నపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థినిలు సిరి అండ్ టీం ప్రదర్శించిన ప్లాస్టిక్ భూతం అనే లఘు నాటిక అందరినీ ఆలోచింపచేసింది. కంఠస్థ పద్యాలు విభాగంలో రామిశెట్టి వెంకట లక్ష్మీ రాగయుక్తంగా పాడి అందరినీ అలరించింది. ఈ రెండు విభాగాల్లో జిల్లా స్థాయిలోజూనియర్స్ విభాగంలో తృతీయ స్థానాలు సాధించారు. వీరికి మెడల్స్, మెమెంటోలు, సర్టిఫికేట్స్ విద్యాశాఖాధికారుల చేతుల మీదుగా ఇప్పించడమైంది. దర్శి మండల విద్యాధికారులు కె. రఘురామయ్య, బీవీ రమాదేవి, హెచ్ఎం పి. సుధాకరరావు, పాఠశాల ఉపాధ్యాయులు సయ్యద్ సుభాని, సిహెచ్. హైమావతి లు బహుమతులు సాధించిన విద్యార్థినిలను, వారిని ప్రోత్సహించిన ఆ పాఠశాల ఉపాధ్యాయుడు గొర్రెపాటి వేణును అభినందించారు.

## అక్రమ వెంచర్ల పై వెంటనే చర్యలు తీసుకుంటాం



కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి స్వర్ణ సాగరం, మార్చి 4:

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ వెంచర్ల పై చట్ట ప్రకారం లేని వాటిపై తక్షణమే చర్యలు తీసుకొని సదరు భూములు అసైన్ భూములు అయినట్లయితే మున్సిపాలిటీ పరిధిలోని అన్నిటిని మున్సిపాలిటీ స్వా ధీనం చేసుకుంటుంది మున్సిపాలిటీ లేనిది రెవెన్యూ శాఖకు అప్ప చెప్పే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. అక్రమ వెంచర్ల వలన ప్రభుత్వ ఆదాయానికి గండిపడి పేద అమాయక ప్రజలు మోసపోయి బలి అయిపోతున్నారని, ప్రజలు ప్లాట్ లోనే వారు చట్ట ప్రకారంగా అనుమతి కలిగిన వెంచర్ల లోనే ప్లాట్లలోని ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా ఇల్లు కట్టు కోవాలన్నారు.అక్రమ వెంచర్లలో ప్లాట్లలో మోసపోయి ఇబ్బందులు పడుతున్నారు. వెంచర్లు వేసే యజమానులు చట్ట ప్రకారమైన రోడ్లు కాలువలు కరెంటు స్తంభాలు వీధి దీపాలు లాంటి మౌలిక వసతులతో వెంచర్లు వేయాలని అక్రమ వెంచర్లు వేసి ఇబ్బందులు పడవద్దని హితవు పలికారు.అక్రమ వెంచర్లను గుర్తింపు చేయమని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు.

## వికసిత్ భరత్ కు భద్రత, శ్రేయస్సే కీలకం



కనిగిరి స్వర్ణ సాగరం, మార్చి 4:

వికసిత్ భరత్ కు భద్రత, శ్రేయస్సు కీలకం అని న్యాయవాది కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. జాతీయ భద్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం కనిగిరి పట్టణం లోని పామూరు బస్టాండ్ నందు గుడ్ హెల్ప్ ఫౌండేషన్,కె ఎస్ ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ, జి ఎస్ అండ్ జి డి కె ఫౌండేషన్ ఆధ్వర్యంలో భద్రత నిబంధనల గురించి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జాతీయ భద్రత,ప్రజా ఆరోగ్యం, పర్యావరణ రక్షణే ధ్యేయంగా భారత కార్మిక మంత్రిత్వ శాఖ1966 మార్చి 4న నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఇండియన్ ఏర్పాటు చేసిందని దీని ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వం 1972 నుంచి ఏటా జాతీయ భద్రత దినోత్సవంను జరుపుకుంటున్నారని తెలిపారు. సమాజంలోని అన్ని రంగాల్లో భద్రతపై అవగాహన కలిగించటమే ప్రధాన లక్ష్యమని అన్నారు. భద్రతా చర్యలలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్యావరణం, కార్యాలయ భద్రత, ఆరోగ్య నియమాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ భద్రతతో పాటు పలు భద్రత విషయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా హెల్ప్ లైన్ 181,సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930, పోలీస్ 100, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఒన్ నేషన్ ఒన్ నెంబర్ 112 హెల్ప్ లైన్ నెంబర్ల గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు, ఐ సి డి ఎస్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్యామ్యూల్ గెర్షోమ్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, హెల్త్ డిపారట్మెంట్ దాసరి ఓంకార్, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఫాం-7 దరఖాస్తులపై విచారణకు సిట్





- ప్రకాశం ఎస్పీ నేతృత్వంలో సాగనున్న దర్యాప్తు
- గత ప్రభుత్వంలోనూ న్యాయపోరాటం చేసిన ఏలూరి
- సిట్ విచారణకు పట్టుబట్టిన ఎమ్మెల్యే ఏలూరి
- ఎమ్మెల్యే ఏలూరి కృషితో సిట్ బృందం ఏర్పాటు
- రాష్ట్రస్థాయిలో సంచలనం రేకెత్తిస్తున్న సిట్
- వైకాపా కుయుక్తులను అధిగమించి భారీ ఓట్ల మెజారిటీతో ఏలూరి విజయం
- అక్రమాలకు పాల్పడిన వైసిపి నేతల వెన్నుల్లో వణుకు

పర్చూరు స్వర్ణ సాగరం, మార్చి 4:

అక్రమ మార్గంలో అధికార దాహంతో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు, తటస్తుల ఓట్లు తొలగించేందుకు అప్పటి అధికార పక్షం వైసిపి చేసిన అక్రమ ఫాం-7 దరఖాస్తుల వ్యవహారంపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసింది. ప్రకాశం జిల్లా ఎస్పీఆర్ దామోదర్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ సీఎస్ కె విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బృందంలో గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్ డిఎస్పి అరవింద్ ను సభ్యుడుగాను మరో అధికారిని సభ్యుడుగా నియమించుకుని వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. సిట్ కు పోలీస్ స్టేషన్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బృందం సిఐడి డీజీపీ నియంత్రణలో పనిచేయనుంది. అలాగే సిట్ బృందానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందించాలని బాపట్ల జిల్లా ఎస్పీ ని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి సిట్ బృందం దర్యాప్తు పురోగతిని ఈసీకి దర్యాప్తులో భాగంగా సిట్ ఎవరినైనా విచారించి, అరెస్టు చేయవచ్చునని ఉత్తర్వుల్లో పేర్కొంది.

**ఎమ్మెల్యే ఏలూరి పోరాటం...** పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా అక్రమ మార్గంలో 24 వేలకు పైగా ఓట్లు తొలగించేందుకు వైసీపీ నేతలు,కార్యకర్తలు ఫాం-7 దరఖాస్తులు చేయించిన వ్యవహారం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఎమ్మెల్యే ఏలూరి పెద్ద ఎత్తున పోరాటం చేశారు. ఎన్నికల కమిషనర్ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. అర్హులైన ఓటర్లను అన్యాయంగా తొలగిస్తున్నారని సాక్షాదారాలతో సహా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం స్పందించకపో వడంతో ఎమ్మెల్యే ఏలూరి న్యాయపోరాటానికి దిగారు. అధికార య ంత్రాంగం మొత్తం అధికార పక్షానికి కొమ్ము కాస్తుందని, సాక్షాలతో సహా నిరూపించి పలు వురు అధికారులను సస్పెండ్ అయ్యేలా చేశారు. ఆది నుంచి స్పష్టమైన అవగాహనతో ఓటర్లను చైతన్యం చేస్తూ ఎక్కడికక్కడ అప్రమత్తం చేశారు. ఒక దశలో హైకోర్టును ఆశ్రయించి ప్రభుత్వంపై పోరాటం సాగించారు.

**సిట్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి...**వైకాపా అధికార దాహంతో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, మోసపూరిత సమాచారంతో ఓట్లను తొలగించేలా కుట్రలు చేశారని ఎమ్మెల్యే ఏలూరి సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం ముందు ఉంచారు. అక్రమాలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదని భీష్మించారు. పర్చూరు నియోజకవర్గంలో ఓట్ల తొలగింపు కోసం గంపగుత్తగా ఫాం-7 దరఖాస్తులు చేశారని, 24 వేల ఓట్లను ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తొలగించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు హోంమంత్రి అనిత, డిజిపి లను స్వయంగా కలిసి విన్నవించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఫిర్యాదుతో స్పందించిన ప్రభుత్వం పర్చూరులో 24 వేల ఫాం-7 దరఖాస్తులు పెట్టడంపై సిట్ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పూర్తి విచారణాధికారాలను సిట్?కు అప్పగించింది.

**రాష్ట్రవ్యాప్తంగా సంచలనం....** పర్చూరు నియోజకవం గంలో 24 వేల ఓట్ల ను తొలగించేందుకు అప్పటి అధికార పక్షం పెద్దలు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. అయితే ఎమ్మెల్యే ఏలూరి వైసీపీ ప్రభుత్వ అక్రమాలను ఎండగడుతూ రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పెద్ద ఎత్తున ఎమ్మెల్యే ఏలూరి పోరాటం సాగించారు. అక్రమంగా ఓట్లు తొలగిస్తున్నారని , అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఏలూరి ఫిర్యాదు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అధికార పక్షం షాప్ కిందనీరులా అధికార దాహంతో ఓట్లను తొలగిస్తుందని పేర్కొనడంతో అన్ని నియోజకవర్గాల్లో నేతలు అప్రమత్తమయ్యారు. దీంతో వైసిపి అక్రమాలకు అడ్డుకట్ట పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే ఏలూరి పోరాటపటిమను కొనియాడారు.

**కుట్రలను ఛేదించి అఖండ మెజారిటీ...**వైసిపి నేతల పన్నాగాన్ని పసిగట్టిన ఎమ్మెల్యే ఏలూరి ప్రజలందరినీ చైతన్యం చేస్తూ న్యాయపోరాటం దిశగా అడుగులు వేశారు. అక్రమ ఓట్ల తొలగింపు వ్యవహారంలో అధికార పార్టీకి తొత్తులుగా మారిన పలువురు అధికారులను సస్పెండ్ చేసే వరకు ఉద్యమించారు. ఎన్ని ఇబ్బందులు గురిచేసిన ఎక్కడ వెనకడుగు వేయకుండా ప్రజలతో మమేకమవుతూ ప్రజలను చైతన్యం చేయడంలో ఎమ్మెల్యే ఏలూరి సఫలీకృతులయ్యారు. ఎమ్మెల్యే ఏలూరిపై నమ్మకం విశ్వాసం ముందుచూపు అభివృద్ధి సేవా కార్యక్రమాలు ఎమ్మెల్యే ఏలూరిపై చేసిన కుట్రలను తిప్పుకొట్టి ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపించారు.

**సిటీ ఏర్పాటుతో వైసిపి నేతల వెన్నుల్లో వణుకు** రాష్ట్ర ప్రభుత్వం పర్చూరు నియోజకవర్గంలో ఫాం-7 దరఖాస్తుల అక్రమ వ్యవహారంపై సిట్ బృందం ఏర్పాటు చేయడంతో వైసిపి అక్రమార్కుల వెన్నుల్లో వణుకు పుడుతుంది. ఫాం-7 దరఖాస్తులు చేసిన పలువురులో భయాందోళన మొదలైంది. అధికార మదంతో అక్రమార్కుల మాట విని నిజమైన ఓటర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించేందుకు దరఖాస్తులు చేశారు. త్వరలో అక్రమార్కులపై సిట్ పంజా విప్పనుంది.

## రైల్వే లైన్ బాధితులకు పరిహారం వెంటనే చెల్లించాలి

### అందుకు భిన్నంగా ఇండ్లు ఖాళీ చేసి వెళ్ళి పొమ్మని బాధితులను వత్తిళ్ళకు గురిచేయడాన్ని అంగీకరించం ప్రజా సంఘాల స్పష్టీకరణ

కనిగిరి స్వర్ణ సాగరం, మార్చ్ 4:



నడకుడి శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా కనిగిరి మండలం పేరంగుడిపల్లి రైల్వే లైన్ బాధితులకు పరిహారం చెల్లించకుండా, బాధితులను ఒత్తిళ్లకు భయభ్రాంతులకు గురిచేయడాన్ని అంగీకరించమని ప్రజా సంఘాలు నేడు ఎమ్మార్వోకు స్పష్టం చేసాయి. గత 14 ఏళ్లుగా నిర్వాసితులు అధికారుల చుట్టూ నష్టపరిహారం కోసం తిరుగుతున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు, బాధితులను మభ్యపెడుతూ వచ్చారని చివరకు మార్చి రెండవ తేదీన రెవెన్యూ సిబ్బంది స్థానిక పోలీసులను, ప్రొక్లైన్ ను వెంటపెట్టుకొని వచ్చి ఇండ్లు ఖాళీ చేసి వెళ్ళిపోతారా లేదా కూల్చమంటారా అని బెదిరించడాన్ని ప్రజా సంఘాలు తీవ్ర స్వరంతో ఎమ్మార్వో ను ప్రశ్నించాయి. దీనిపై ఎం ఆర్ ఓ మాట్లాడుతూ బాధితులకు పరిహారం ఇప్పిస్తామని మేము హామీ ఇస్తున్నాం కనుక రైల్వే లైన్ నిర్మాణానికి ఆటంకం కలిగించకుండా ఖాళీ చేసి వెళ్లిపోవాలని కోరడం జరిగింది. దీనికి స్పందించిన ప్రజాసంఘాల నాయకులు నష్టపరిహారానికి సంబంధించిన స్పష్టమైన హామీని మీరు రాతపూర్వకంగా ఇవ్వకుండా మీ మాటను నమ్మలేమని, ఇలా నమ్మే ఇప్పటివరకు బాధితులు మోసపోయారని అన్నారు. బాధితుల్లో ఒకరైన అంబటి సుజాత మాట్లాడుతూ రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన పునాది గుంతలో పడి తమ బిడ్డలు ఇండ్ల దినేష్, ఇండ్ల లోకేష్ చనిపోయారని, ఇప్పుడు బాధితులకు నెత్తిన నీడ లేకుండా యిండ్లను కూల్చి అనాధలను చేస్తారా ? ఇదేమి పద్ధతి ? మీకు కుటుంబాలు లేవా ? బాధితులుగా ఉన్నఫలంగా మేము ఎక్కడికి వెళ్ళగలం అని అన్నారు. వ్యక్తులనుండి మేము డబ్బు ఆశించడం లేదని, ప్రభుత్వం నుండి గౌరవ ప్రదంగా నష్టపరిహారం అందే వరకు ఇండ్లు ఖాళీ చేసి వెళ్లిపోయేది లేదని తీవ్ర స్వరంతో బాధితులు అందరూ మూకుమ్మడిగా ఎమ్మార్వో కు స్పష్టం చేశారు. దీనితో ఎంఆర్ఓ తొలిదశలోనే నష్టపరిహారానికి సంబంధించిన రిపోర్ట్ పంపడంలో పొరపాట్లు జరిగాయని, ఆ పొరపాట్లను సవరించడానికి మేము ప్రయత్నం చేస్తున్నామని, అందుకు కొంత సమయం పడుతుందని, శాసనసభ్యులు కూడా ఇందులో తన వంతు కృషి చేస్తున్నారని, మా మాట మీద మీరు విశ్వాసం ఉంచి యిండ్లు ఖాళీ చేయాలని మరల అదే పాత వాదనని వినిపించారు. దీనితో ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వం నుండి పరిహార వచ్చేంతవరకు నిర్వాసితుల జోలికి వెళ్ళద్దని, ఎట్టి పరిస్థితిలో ఇండ్లు ఖాళీ చేయబోరని, బలవంతంగా ఖాళీ చేయించడానికి ప్రయత్నిస్తే, ఏదైనా జరగరానిది జరిగితే, ఖచ్చితంగా అధికారులుగా మీరు బాధ్యులు అవుతారని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. దీనితో సమస్య తీవ్రతను తక్షణమే ఆర్డీవో ద్వారా జిల్లా కలెక్టర్ కు నివేదిస్తామని పరిహారం కచ్చితంగా అందే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పివి శేషయ్య సిఐటియు, జిపి రామారావు వ్యవసాయ కార్మిక సంఘం, పి మోహన్ దళిత హక్కుల పోరాట సమితి, సిహెచ్ పవన్ కళ్యాణ్ ఏఐఎస్ఎఫ్, టి తిరుపతిరావు బీసీ సంఘాల ఐక్యవేదిక, మరియు ఇండ్ల మాలకొండ రాయుడు, అంబటి వెంకటేశ్వర్లు, అంబటి నాగరాజు, యిండ్లా వెంకటేశ్వర్లు బాధితులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నిరుపేదలకు చెందాల్సిన భూములు వెంటనే పేదలకు తిరిగి ఇచ్చేయాలి



- భూ అక్రమాలపై ఐఏఎస్ అధికారితో విచారణ చేయించాలి
- భూ అక్రమాలపై సత్యసాయి ఇంచార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్తాం
- పేదల పక్షాన సిపిఐ పార్టీ అండగా ఉంటుంది.. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ధర్మవరం స్వర్ణ సాగరం, మార్చి 4:

ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ మండల పెద్ద బాపనపల్లి తండా లో గిరిజన భూములు కబ్జా జరిగిన విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మంగళవారం ఆ గ్రామానికి చేరుకొని గ్రామం నడిబొడ్డున రచ్చబండ దగ్గర భూములు కోల్పోయిన ఆ రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ముదిగుబ్బ మండల అధ్యక్షులు గోడ్డుమరి ఆదినారాయణ యాదవ్ గిరిజనుల కు చెందాల్సిన 200 ఎకరాల భూమిని కబ్జా చేశారని పెద్ద బాపనపల్లి తండా రైతులు మా తాతల కాలం నుంచి ఉన్న భూములు మాకు ఇప్పించి మాకు న్యాయం చేసి తమ భూములు వెనక్కి ఇప్పివ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తో తమ గోడు వెళ్ళబోసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ పేద ప్రజలు అమాయకులైన గిరిజనులకు సంబంధించిన రెండు వందల ఎకరాల భూమిని ముదిగుబ్బ మండల అధ్యక్షులుగోడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ తమ కుటుంభికుల పేరు మీదుగా ఆన్లైన్లో పట్టాలెక్కించుకొని ఆ భూముల మీద బ్యాంకులో లోను కూడా తీసుకున్నారు. ఈ భూములు నిరుపేదలవి వారి భూములు వారికే చెందాలని ఇక్కడ జరుగుతున్న భూ అక్రమాలను ఏడవ తేదీ సత్యసాయి జిల్లా ఇన్చార్జి మంత్రి రెవెన్యూ శాఖ మంత్రి అయిన అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్తామని అలాగే ధర్మవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మంత్రి అయినటువంటి సత్యకుమార్ దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. ఈ భూ అక్రమాలపై ఐఏఎస్ అధికారితో విచారణ చేపట్టి పేదల భూమి పేదలకే చెందేలా చేయాలన్నారు. ఈ భూ అక్రమాలపై సహకరించిన అధికారుల పైన కూడా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు పేదలకు చెందాల్సిన ఈ భూములు పేదలకు చెందే వరకు తమ పోరాటం ఆగదని రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఉద్యమం చేస్తామని ఆయన అన్నారు. సిపిఐ పార్టీ ముదిగుబ్బ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, వ్యవసాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రప్ప, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కాటమయ్య, చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకా చలపతి ధర్మవరం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంతోష్ కుమార్ వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి మహదేవప్ప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, బత్తల పల్లి మండల కార్యదర్శి బండల వెంకటేష్ తదితరులతో పాటు ముదిగుబ్బ సిపిఐ నాయకులు రైతు సంఘం మండల కార్యదర్శి డాబా రామకృష్ణ, గంగిరెడ్డిపల్లి నాయుడు, చల్లా శంకర, రాధాకృష్ణ, రామంజి, వై రమేష్ మధు సిపిఐ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.


# అక్రమంగా చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోండి

**అనుమతులు లేకుండా సామిల్లులలో నిలువ ఉంచితే సామిల్లులపై చర్యలకు ఆదేశించండి**

**లక్షలు విలువ చేసే చెట్లను ఇటుక బట్టీలలో కాలిస్తే అధిక మొత్తంలో పెనాల్టీలు వేయండి**

ధర్మవరం స్వర్ణ సాగరం, మార్చి 4:

ధర్మవరం ఆర్డీవోకు వినతి పత్రం అందజేసిన ప్రముఖ పర్యావరణవేత్త రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయడు ఇప్పటికే పుట్టపర్తి డివిజన్ పరిధిలో ప్రత్యేక టీం ఏర్పాటు శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం డివిజన్ వ్యాప్తంగా వాల్టా చట్టాన్ని ధిక్కరించి ప్రతిరోజు కొన్ని వేల చెట్లను ఇష్టానుసారం నరికేస్తున్నారు వాటినన్నింటినీ ఇటుక బట్టీలకు సామీలులకు పక్క రాష్ట్రాలకు లెక్కలేని తనంతో తరలిస్తున్నారు.దేశంలోనే రెండవ కరువుజిల్లా ఈ జిల్లా కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరువు నివారనాచర్యలకోసం ఎంతో ప్రజాధనాన్ని వినియోగిస్తూ ఉంటారు. అలాంటిది ధర్మవరం డివిజన్ పరిధిలో వాల్టా చట్టాన్ని ధిక్కరించి ప్రతిరోజు వేల చెట్లనునరికి కళ్ళ ఎదుటే దారుణం జరుగుతున్నా ఇంతవరకు చర్యలు చేపట్టలేదు. కొంతమంది స్వార్థపరు లైన వ్యాపారస్తులు సంబంధిత అటవీ అధికారుల వల్ల కరువుజిల్లాలో కోట్ల జీవరాసులకు తీరని నష్టం జరుగుతోంది. ప్రతినెలా సామిల్లులనుండి ఇటుక బట్టీలనుండి పక్క రాష్ట్రాలకు కలప తరలించే వారినుండి



అధికమొత్తంలో మామూళ్లకు అలవాటు పడిన అలాంటి అధికారులు కరువు జిల్లాలో ప్రకృతితో ఆడుకుంటున్నారు. రక్షిస్తామని ప్రమాణం చేసి బక్షిస్తున్నారు. ఇప్పటికైనా తమరు ప్రత్యేక టీం ఏర్పాటు చేసి ప్రకృతిని కాపాడమని ఆర్ డి ఓని కోరడమైనది తక్షణం స్పందించిన వారు స్పెషల్ టీంకై ఏర్పాట్లు చేయమని ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి ప్రాంతాలలో నీలాంటి వారి ఆవశ్యకత ఎంతైనా ఉందని అందుకోసం మీరు చెప్పిన విషయంపై రక్షణ చర్యలు చేపడతామని వారు తెలియజేశారు. సరైన పర్మిషన్స్ లేకుండా అక్రమ కల్పననిలువ ఉంచిన సామిల్లులను సీజ్ చేస్తామని తెలియజేశారు. ఇంత వరకు ట్రాన్స్పోర్ట్ పర్మిషన్ గాని ప్రతి పర్మిషన్ గాని లేకపోయినా కళ్ళ ఎదుట యదేచ్ఛగా అక్రమ కలప తరలిస్తున్నా దీనస్థితిలో చూడటం తప్ప ఏమీ చేయలేని పరిస్థితులలో ప్రజలు రిపోర్టర్లు, అధికారులు సైతం ఉండిపోయారు. కొంతమంది అవినీతిఅటవీ అధికారుల లాలూచీ వల్ల ధర్మవరం ప్రాంతంలోఅధిక నష్టం జరుగుతోంది. సీఎం చంద్రబాబు నాయుడు గారు విజన్ 2047 లో భాగంగా 50శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్నారుకనుక తమరు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇప్పటికే మేము గత కొన్ని సంవత్సరాలుగా 50 లక్షల పైతీలుకు వృక్షాలను నరకకుండా కాపాడి ఉంటాం అలాగే ఐదు లక్షల పైచిలుకు మొక్కలు నాటించి ఉంటాము అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యూనివర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలు సైతం తిరుగుతూ చెట్లయొక్క గొప్పతనాన్ని ఈ తరం వారికి తెలియజేస్తూ ఉన్నాను. సుప్రీంకోర్టు నియమించిన సభ్యులు సమర్పించిన నివేదిక మేరకు ఒక చెట్టు విలువ 74 లక్షలు గా నిర్ణయించారు కరువు జిల్లాలో ప్రతిరోజు వేల చెట్లు అక్రమంగా నరికితే ఈ జిల్లా సంపద ఎంత ఆవిరి అయిపోతూ ఉంటుందో తమరే నిర్ణయించండి. ఇది పెద్ద విపత్తు కనుక తక్షణ చర్యలకు ఆదేశాలు ఇవ్వమని అందులో మా సభ్యులు సైతం ఉండేలా చూడమని అక్రమంగా నరికిన ప్రతికలపనూ చూపిస్తామని వారు తెలియజేశారు.

# నీటి సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసిన పరిటాల సునీత

**హంద్రీనీవా ద్వారా రాప్తాడులోని 38 చెరువులకు నీరందించాలని విజ్ఞప్తి**

**లైనింగ్ వలన నియోజకవర్గానికి ఎలాంటి నష్టం రాకుండా చూడాలని వినతి**

**ప్రాజెక్టు కోసం భూమిలిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి**

**సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

ధర్మవరం స్వర్ణ సాగరం, మార్చి 4:

రాప్తాడు నియోజకవర్గంలోని సాగు, త్రాగునీరు, రైతుల సమస్యల్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అమరావతికి వెళ్లిన ఎమ్మెల్యే సునీత మంగళవారం ముఖ్యమంత్రిని కలిశారు. నియోజకవర్గంలో ప్రధానంగా హంద్రీనీవా ద్వారా నీరందించే అంశం గురించి చర్చించారు. హంద్రీనీవా 2 వదశలో కాల్వకు లైనింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. లైనింగ్ పనులు చేస్తే రాప్తాడు నియోజకవర్గంలో 38 చెరువులకు నీరందే అవకాశం లేదని, భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉందని వివరించారు. కాలువ వెంబడి గల వివిధ చెరువులు,



కుంటలకు హంద్రీనీవా నీరు అందేలా తూములను ఏర్పాటు చేయటం, కాలువ సమీపంలో వంకలపై గల చెక్ డ్యామ్ లకు నీరు అందించే విధంగా తూములు ఉండాలని, కాలువ ఉన్న ప్రాంతంలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజలు కాలువను దాటే విధంగా వంతెనలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా రాప్తాడులో 70 వేల ఎకరాలకు పైగా హంద్రీనీవా పరిధిలో ఆయకట్టు ఉందన్నారు. ఇప్పటి వరకు డిస్ట్రిబ్యూటరి సిస్టమ్ లేనందున తాత్కాలికంగా హంద్రీ నీవా నీటిని కాలువ ద్వారా చెరువులకు సరఫరా చేస్తున్నారు. ఆయకట్టును స్థిరీకరించి పంట కాలవల అభివృద్ధి చేస్తే భూగర్భ జలాలు సంవృద్ధిగా ఉంటాయన్నారు. దీని వలన పరోక్షంగా మరో 10వేల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. కావున మా విన్నపాన్ని పరిగణలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. మరోవైపు జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పరిటాల రవీంద్ర అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇచ్చే అంశాన్ని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2018లో అప్పట్లో మీ మీద నమ్మకంతో భూములిచ్చిన రైతుల్లో చాలా మందికి ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. యూపీపీ కాలువకు సంబంధించి భూసేకరణకు మొత్తం రూ.50.00 కోట్లకు గాను రూ.4.86 కోట్లు గతంలో చెల్లించారన్నారు. ప్రస్తుతం రూ.14.50 కోట్లకు సీఎఫ్ఎంఎస్ ద్వారా భూసేకరణ చెల్లింపుల కోసం అప్లోడ్ చేశారన్నారు. వెంటనే ఈ రూ.14.50 కోట్ల నిధులు విడుదల చేసి.. పనులను పునః ప్రారంభించాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సునీత చెప్పిన అన్ని అంశాల మీద ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రాప్తాడు నియోజకవర్గ రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని చెరువులకు నీరందించే విషయంలో రాజీ ఉండదని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# కే వి బి పురం మండల కేంద్రం లో లూథరన్ చర్చి బిల్డింగ్ నిర్మాణానికి భూమి పూజ...!!





**చర్చి బిల్డింగ్ భూమి పూజలో తిరుపతి ఈస్ట్ మిషన్ ఎస్ ఏ ఎల్ సి బిషప్ మైఖేల్ బాబు...!!**

**కలతూరు ఎస్ ఏ ఎల్ సి లోక్కీ ప్యారిస్ ఆధ్వర్యంలో వైభవంగా చర్చి నిర్మాణానికి భూమి పూజ.**

కే వి బి పురం మార్చ్ 4 : తిరుపతి జిల్లా కెవిబిపురం మండల కేంద్రంలో ఎస్ ఏ ఎల్ సి కలతూరు లోక్కీ ప్యారిస్ సంఘానికి సంబంధించిన భూమిలో మంగళవారం చర్చి నిర్మాణానికి భూమి పూజ (శంకుస్థాపన) నిర్వహించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి తిరుపతి ఈస్ట్ మిషన్ ఎస్ ఏ ఎల్ సి కాంపొండ్ బిషప్ రెవరెండ్ మైకేల్ బాబు మరియు సమాజ సేవకులు విజయ్ కుమార్ వివిధ లూథరన్ సంఘ పాస్టర్లు పాల్గొన్నారు. 1962 లో డార్నోవర్ అనే విదేశీ సేవకుడు కలతూరు లో చర్చి బిల్డింగ్ నిర్మించి సేవను కొనసాగి ంచారు. కలతూరు చర్చి బిల్డింగ్ కు ఆధారంగా కేవీబీ పురం మండల కేంద్రంలో ఇంచుమించు మూడు ఎకరాలు స్థలాన్ని కొనిపెట్టారు. ఆ స్థలాన్ని ఆధారం చేసుకుని కలతూరు ఎస్ ఏ ఎల్ సి సంఘస్తులు సంఘ కాపరిని పోషిస్తూ సంఘాన్ని నడిపిస్తున్నారు. ఇటీవల కొంతమంది ఆ స్థలంపై కన్నేయడంతో కలతూరు సంగతులు పోరాడి దక్కించుకున్నారు. దీంతో ఆ స్థలంలో కూడా చర్చి బిల్డింగ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పునాది వేశారు. ఈ



కార్యక్రమంలో కలతూరు సంగతులు పీసీసీ నెంబర్లు సామివేలు రాజబాబు విజయభాస్కర్ యేసయ్య థామస్ మరియు గ్రామస్తులు సైతం పాల్గొన్నారు

# "కార్మికుల సమస్యలు పరిష్కరించాలి,

**సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నీరటి మల్లేష్,**

శంషాబాద్ మార్చి04 ఉదయం ప్రతినిధి : శంషాబాద్ మున్సిపాలిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో శంషాబాద్ మున్సిపాలిటీ కమిషనర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు నీరటి మల్లేష్ మాట్లాడుతూ... కమిషనర్ పరిధిలో ఉన్న శంషాబాద్ మున్సిపాలిటీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఎండాకాలం వచ్చింది కార్మికులు ఎండకు తట్టుకోలేక ఆయాస పడుతూ పనిచేస్తున్నారు, నీరసమై పడిపోయే పరిస్థితి ఉన్నది అందుకని శంషాబాద్ లోని కార్మికులందరికీ మార్చి నుండి మే వరకు ఉదయం 5 గంటల నుండి 12 గంటల వరకు పని చేయించాలని అన్నారు అదే రకంగా ఈఎస్ఐ, పిఎఫ్, లేని కార్మికులకు ఈఎస్ఐ పిఎఫ్ వర్తింపజేయాలని అన్నారు. 39 మంది కాంట్రాక్టు కార్మికులను కాంట్రాక్టు పద్ధతిని రద్దుచేసి అందరి కార్మికుల వల్లే పేర్లు నమోదు చేయాలని అన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులందరికీ తమ తమ హోదాలను గుర్తింపు కార్డులో నమోదు చేసి గుర్తింపు కార్డులు కమిషనర్ ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికునికి ఇన్సూరెన్స్ 10 లక్షల రూపాయలు ఇవ్వాలి. కామాటి డ్రైవర్స్ సూపర్వైజర్స్ లో పనిచేస్తున్న కార్మికులకు ఎలాంటి సమయం కేటాయించకుండా 12 గంటలు పనిచేస్తున్నారు ఇట్టి విధానాన్ని రద్దుచేసి8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల సబ్బులు రెండు రెండు చొప్పున అలాగే నూనెలు ఇవ్వాలని అన్నారు ప్రతి సంవత్సరం రెండు జతల చెప్పులు ఇవ్వాలి ప్రతినెల చీపుర్లు తప్పకుండా ఇవ్వాలి పనిచేస్తున్న సమయంలో ఏదైనా అనుకోకుండా ప్రమాదం జరిగి మరణిస్తే లేదా కాళ్లు చేతులు విరిగిన ఇన్సూరెన్స్ లేనియెడల కమిషనర్ ది మరియు శానిటేషన్ శానిటేషన్ ఇనిస్పెక్టర్ లక్ష్మయ్య, బాధ్యత వహించాలి. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపాలిటీ సంఘం అధ్యక్షులు T.S .ప్రవీణ్ , గోపాల్ ,సత్తయ్య ప్రజా సంఘాల మండల నాయకులు కేవై ప్రణయ్ ఏపూరి పవన్ కుమార్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని కలిసికట్టుగా అత్యంత విజయవంతం చేద్దాం

**పార్టీ శ్రేణులకు హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పిలుపు**

ధర్మవరం స్వర్ణ సాగరం, మార్చి 4:



ఈ నెల 14 వ తేదీన పిఠాపురం, చిత్రాడలో జరగబోయే జనసేన పార్టీ 12 వ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయుట కొరకు ఈ రోజు ధర్మవరం పట్టణంలోని జనసేన పార్టీ నూతన కార్యాలయంలో హిందూపురం పార్లమెంట్ పరిధిలో ఉన్నటువంటి 7 నియోజకవర్గాల జనసేన పార్టీ ఇన్చార్జ్ లతో, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, వీర మహిళలు, ముఖ్య నాయకులతో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి సమావేశం నిర్వహించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 14 వ తేదీన జనసేన పార్టీ 12 వ ఆవిర్భావ దినోత్సవాన్ని కని విని ఎరుగని రీతిలో పవన్ కళ్యాణ్ పేరు, జనసేన పార్టీ గురించి దేశవ్యాప్తంగా చర్చించుకునే విధంగా ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేసి పిఠాపురానికి లక్షల్లో తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. హిందూపురం పార్లమెంట్ పరిధిలో వున్న 7 నియోజకవర్గాల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇన్చార్జ్ ల ఆధ్వర్యంలో పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ లతో సమావేశాలు నిర్వహించాలన్నారు.

# వాహనాల నియమ నిబంధనలు తప్పక పాటించాలి ట్రాఫిక్ ఎస్సై వెంకటరాముడు



ధర్మవరం స్వర్ణ సాగరం, మార్చి 4:

ధర్మవరం పట్టణంలోని వాహనదారులందరూ కూడా వాహనాల నియమ నిబంధనలు, చట్టాన్ని తప్పక పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరాముడు తెలిపారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీలను చేస్తూ, అనంతరం వాహనదారులతో నూతనంగా వచ్చిన మోటార్ వెహికల్ చట్టము, జరిమానా గూర్చి తెలియజేశారు. అంతేకాకుండా ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కొత్తగా అమలు కానున్న మోటార్ వెహికల్ జరిమాణాలు కూడా తప్పక వేయబడునని తెలిపారు. మార్చి 1వ తేదీ నుండి మోటార్ వాహనాల చట్టం అమలులోకి వచ్చిందని తెలిపారు. అనంతరం జరిమానాల వివరాలను తెలియజేస్తూ హెల్మెట్ లేకపోతే వెయ్యి రూపాయలు, వాహనంలో వెనక కూర్చున్న వ్యక్తికి కూడా శిరస్రానం తప్పనిసరి అని లేనియెడల వెయ్యి రూపాయలు జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వేయి రూపాయలు, వాహనానికి బీమా లేకపోతే 1000 రూపాయలు, రెండోసారి పట్టుబడితే 2000 రూపాయలు, శబ్దం పొగా కాలుష్యం చేస్తే 2000 రూపాయల నుంచి 4 వేల రూపాయల వరకు, డేంజరస్ పార్కింగ్ వద్ద వాహనము ఉంచితే 1500 రూపాయల నుండి 3వేల రూపాయల వరకు, ఓవర్ స్పీడ్ అనగా రేసింగ్ వెళితే 5000 రూపాయలు, డేంజరస్ డ్రైవింగ్ చేస్తే పదివేల రూపాయలు, మైనర్లు డ్రైవింగ్ చేస్తే వెయ్యి రూపాయలు జరిమాణాలు ఉంటాయని తెలిపారు. ప్రయాణికులను రవాణా వాహనాలలో ఎక్కిస్తే మనిషికి రూ.200 చొప్పున జరిమాణాలు తప్పక విధిస్తామని తెలిపారు. కావున వాహనదారులు పై తెలిపిన నూతన చట్టాన్ని గౌరవిస్తూ సహకరించాలని తెలిపారు.

# కొలనుపాక పుణ్యక్షేత్రానికి మహా పాదయాత్ర ప్రారంభం

తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి మార్చి 04 : కొలనుపాక పుణ్యక్షేత్ర ఆది జగద్గురువు రేణుకాచార్య భగవత్పాదకుల జయంతోత్సవ మహాపాదయాత్ర మంగళవారం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సుంకిని గ్రామం నుండి శ్రీ శ్రీ సద్గురు సిద్ధప్ప మహారాజ్ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఆలేరు మండలం కోలానుపాక గ్రామంలో వెలిసిన శ్రీ సోమేశ్వర ఆలయంలో ఆది జగద్గురు రేణుక చార్య దర్శనం కోసం మహా పాదయాత్ర మంగళవారం బీర్కూరుకు చేరుకుంది. ఇక్కడ హనుమాన్, భవాని కమిటీ సభ్యులు మహా పాదయాత్రకు బయలు దేరుతున్న భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కొలనుపాక సోమేశ్వర ఆలయం 12 రోజుల్లో చేరుకుంటామని భక్తులు వెల్లడించారు. 200 మంది భక్తులు పాదయాత్రలో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో మహిళలు ఈ పాదయాత్ర లో కొనసాగుతున్నారు.

# " డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలి..

శంషాబాద్ మార్చి04 ప్రతినిధి: మైలార్దేవ్పల్లి డివిజన్. ఆప్కో కాలనీ సర్వే నంబర్ 156/1 లో గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయాయి అప్పట్లో స్థానికంగా ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రకాష్ గౌడ్ నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై ప్రజలు తీవ్రంగా అగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు దీనికి తోడు సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో దాదాపుగా 30% డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు జరిపిన కాంట్రాక్టర్ ప్రభుత్వం నుండి నిధులు మంజూరు కాకపోవడం వల్ల ఇళ్ల నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేశారు దీంతో డబల్ బెడ్రూం ఇండ్లపై ఆశ పెట్టుకున్న నిరుపేదలు అద్దె గదుల్లో జీవనం కొనసాగిస్తున్నారు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం నిలిచిపోయి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుండి మంజూరు చేయించడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని అంతేకాకుండా డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్ధాంతరంగా నిలిచిపోవడం వల్ల డబల్ బెడ్ రూమ్ కు సంబంధించిన స్థలం అన్యాక్రాంతంగా కబ్జాకు గురవుతుంది కబ్జాదారులు రాత్రికి రాత్రే ఇల్ల నిర్మాణం చేపడుతున్నారు అయినా కూడా అధికారులు స్పందించడం లేదు ఇందుకు తోడు అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్ అడ్డాగా మారిందని బిఆర్ఎస్ పార్టీ మైలార్దేపల్లి డివిజన్ యూత్ ప్రెసిడెంట్ అక్కెం రాఘవేందర్ యాదవ్. అన్నారు,

# ఎసిబికి చిక్కిన జిహెచ్ఎంసి డిఈఈ

తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి మార్చి 04 : హైదరాబాద్ లోని జిహెచ్ఎంసి డిప్యూటీ ఈఈ లంచం తీసుకుంటూ సోమవారం సాయంత్రం ఎసిబి అధికారులకు రెడ్హ్యాండెడ్గా పట్టుబడ్డాడు. జిహెచ్ఎంసిలో క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఈఈగా పని చేస్తున్న ఎ.దశరథ్ ముదిరాజ్ డిజివిజన్ -2 లో పనిచేస్తున్నాడు. బాధితుడి ఫైల్ క్లియర్ చేసేందుకు 20 వేల రూపాయల డబ్బును డిమాండ్ చేశాడు. దానిలో భాగంగా ఒప్పందం ప్రకారం 10 వేల రూపాయలను బాధితుడు అందజేయగా మిగతా డబ్బులు పని అయిన తర్వాత ఇస్తానని చెప్పాడు. దీంతో డిఈఈ మిగతా డబ్బులు ఇవ్వాలని బాధితుడిపై ఒత్తిడి తేవడంతో ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు డిప్యూటీ ఈఈకి 20 వేల రూపాయలు కార్యాలయంలో ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. తర్వాత డిప్యూటీ ఈఈని నాంపల్లిలోని ఎసిబి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. దీంతో డిఈఈని ఎసిబి అధికారులు జైలుకు పంపించారు.



# మ్యాజికల్ ఎంటర్‌టైనర్‌గా 'టుక్ టుక్'

హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు,సాన్వీ మేఘన, నిహాల్ కోధాటి ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని . చిత్రవాహిని మరియు ఆర్ వై జి సినిమాస్ పతాకంపై రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి కృష్ణలు నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోంది. కాగా ఈ చిత్రాన్ని మార్చి 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు మేకర్స్. మంగళవారం ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ సందర్భంగా శాన్వీ మేఘన మాట్లాడుతూ " పుష్పక విమానం తరువాత నేను చేసిన ఆటో ఎంటర్‌టైనర్ టుక్ టుక్. టీజర్ అందరికి నచ్చిందని అనుకుంటున్నాను. ఈ సినిమాలో సూపర్ నేచురల్, మ్యాజికల్ పవర్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఈ సినిమాలో ఉన్న చాలా సర్‌ఫ్రైజెస్ ఎంజాయ్ చేయడానికి అందరూ ఈ సినిమాను థియేటర్‌లో చూడాలి" అన్నారు. రోషన్ మాట్లాడుతూ "టీజర్ అందరికి నచ్చిందని అనుకుంటున్నాను. ముగ్గురు యువకుల ప్రయాణం. వాళ్ల జీవితంలో వచ్చిన మ్యాజికల్ ఎలిమెంట్స్‌ను ఎలా ఫేస్ చేశాడో ఈ సినిమా చూసి తెలుసుకోవాలి. తప్పకుండా ఈ సినిమా అందరి హృదయాలకు హత్తుకుంటుందనే నమ్మకం ఉంది' అన్నారు. కార్తికేయ మాట్లాడుతూ " చాలా ఎంజాయ్ చేస్తూ ఈ సినిమా చేశాం. ఈ సినిమాలో ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ ఉన్నాయి. అందరూ సినిమాను ఎంజాయ్ చేస్తారు. మంచి కిక్ ఇస్తుంది' అన్నారు. దర్శకుడు సుప్రీత్ కృష్ణ మాట్లాడుతూ " థియేటర్‌లో ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన సినిమా ఇది. ఇదొక డిఫరెంట్ కాన్సెప్ట్. త్వరలో ఈ సినిమా గురించి ఓ బిగ్గెస్ట్ సర్‌ఫ్రైజ్ రాబోతుంది. అది చూసి అందరూ షాక్ అవుతారు. ఈ సినిమాను అందరూ ఆదరిస్తారని కోరుకుంటున్నాను. నిహాల్ కోదాటి మాట్లాడుతూ " ఈ సినిమా చాలా అందంగా డిజైన్ చేశాం. ఫస్ట్ హాఫ్ ముగ్గురు యువకుల ఎంటర్‌టైన్ ఉంటే సెకండాఫ్‌లో బ్యూటిఫుల్ లవ్‌స్టోరీ ఉంటుంది. సాధారణంగా పెద్ద సినిమాల్లో ఫాంటసీ అంశాలు ఉంటాయి. ఈ సినిమాలో ఫాంటసీ, లవ్, ఎంటర్‌టైన్‌మెంట్ ఉన్నాయి. మార్చి 21న అందరూ థియేటర్‌లో ఎంటర్‌టైన్ అవ్వొచ్చు. టైమ్‌కు, మనీకి వాల్యూ ఇచ్చే సినిమా ఇది' అన్నారు.

# స్పెషల్ ట్రైనింగ్ దేనికో?



పుష్ప-2 సినిమా కోసం అల్లు అర్జున్ అభిమానుల సుదీర్ఘ నిరీక్షణకు గత డిసెంబరులో తెరపడింది. బన్నీ కష్టానికి ఆ సినిమా గొప్ప ఫలితాన్నే అందించింది. ఆ సినిమా థియేట్రికల్ రన్ ముగిసిన దగ్గర్నుంచి బన్నీ కొత్త సినిమా కబురు కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. కానీ ఆచితూచి సినిమాలు చేసే అల్లు హీరో కొత్త సినిమాను ఎంతకీ ప్రకటించడం లేదు. ఎప్పుడో ఓకే అయిందుకున్న త్రివిక్రమ్ సినిమా ఎందుకో ముందుకు కదలడం లేదు. ఈలోపు తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీతో సినిమా తెరపైకి వచ్చింది. కానీ అది కూడా వెంటనే పట్టాలెక్కడం సందేహంగానే కనిపిస్తోంది. బన్నీ ఏమో అసలు ఎవరికీ అందుబాటులో లేకుండా ఏదో ఫారిన్ టూర్ వెళ్లినట్లు వార్తలు వచ్చాయి. తాజా కబురేంటంటే.. సోమవారమే బన్నీ సిటీలోకి అడుగు పెట్టాడట. మరి కొత్త సినిమా గురించి అప్‌డేట్ ఏంటి అని బన్నీ సన్నిహితుడైన బన్నీ వాసును చావా తెలుగు వెర్షన్‌కు సంబంధించిన ప్రెస్ మీట్లో విలేకరులు అడిగితే స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోయాడు. బన్నీ ఒక స్పెషల్ ట్రైనింగ్ కోసం వేరే దేశానికి వెళ్లినట్లు బన్నీ వాసు వెల్లడించడం విశేషం. ఇది పర్సనల్ ట్రైనింగ్ అని చెప్పాడు వాసు. బన్నీ నటనకు సంబంధించి ఎప్పుడూ రీసెర్చ్ చేస్తూనే ఉంటాడని.. కొత్త కొత్త పద్ధతులను అనుసరిస్తుంటాడని.. ఇందులో భాగంగానే ట్రైనింగ్ కోసం ఫారిన్ వెళ్లాడని వాసు తెలిపాడు. మరి ఈ స్పెషల్ ట్రైనింగ్ మతలబు ఏంటో.. అది ఏదైనా పర్టికులర్ సినిమా కోసం తీసుకున్నాడా, లేక జనరల్ ట్రైనింగా అన్నది బన్నీ సన్నిహితులే చెప్పాలి. ఇక బన్నీ కొత్త సినిమా కబురు గురించి వాసు మాట్లాడుతూ.. దాని గురించి బన్నీ టీమే త్వరలో ప్రకటన చేస్తుందని చెప్పాడు. తాను కూడా బన్నీని ఇంకా కలవలేదని.. త్వరలో కలుస్తానని తెలిపాడు.

# ఎవరికీ చెప్పకుండా.. ఒంటరిగా వెళ్లి అబార్షన్ చేయించుకున్నా



నెట్‌ఫ్లిక్స్ నుంచి వచ్చిన సాక్రేడ్ గేమ్స్ వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటి కుబ్రా సైత్ తన వ్యక్తిగత జీవితంలో జరిగిన సంచలన విషయం గురించి మీడియాతో తాజాగా పంచుకుంది. తాను అండమాన్ ట్రిప్‌లో ఉన్నప్పుడు ఒక స్నేహితుడితో కలవడం వలన గర్భం దాల్చానని.. దీంతో ఒక్కసారిగా ఏం చేయాలో తోచలేదని అందుకే వెంటనే ఎవరికీ చెప్పకుండా.. ఒంటరిగా వెళ్లి అబార్షన్ చేయించుకున్నాను అంటూ నటి చెప్పుకొచ్చింది. అబార్షన్ చేయించుకోవడానికి వెళ్లినప్పుడు నేను చాలా బలహీనంగా ఉన్నాను. అప్పుడే అర్థం అయ్యింది. దీనిని నేను మోయలేను అని.. ఒకవేళ నేను అబార్షన్ చేయంచుకోపోతే బిడ్డతో జీవిస్తానని చెప్పే ధైర్యం కూడా నాకు లేదనిపించింది. అందుకే ఎవరికీ చెప్పకుండా ఒంటరిగా వెళ్లి అబార్షన్ చేయించుకున్నా. అబార్షన్ అనంతరం నేను చాలా రిలీఫ్ అయ్యాను. ఎదో బరువు దిగినట్లు అనిపించింది. అయితే అబార్షన్ తర్వాత ఈ విషయాన్ని చాలా ఏండ్ల వరకు ఎవరితో పంచుకోలేదని తెలిపింది. ఇక ఈ విషయాలన్నింటిన తన బయోగ్రఫీ అయిన ఓపెన్ బుక్: నాట్ క్వైట్ ఎ మెమోయిర్" (2022) అనే పుస్తకంలో ప్రస్తవించింది కుబ్రా సైత్ సినిమా విషయాలకు వస్తే.. సాక్రేడ్ గేమ్స్ తర్వాత మళ్లీ కనిపించలేదు ఈ నటి. అయితే తాజాగా బాలీవుడ్ నుంచి వస్తున్న రామాయణ్‌లో ఈ భామ రావణుడి చెల్లి శూర్పణఖ పాత్రలో నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా దీనిపై చిత్రబృందం ప్రకటించాల్సి ఉంది.

# సరికొత్తగా 'లవ్ స్టోరీ బిగిన్స్'



'చిన్నప్పటి నుంచి సినిమాలే లోకంగా పెరిగా. అవే నా జీవితంగా ఫిక్సయ్యా. నా జీవితంలో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా బోలెడు వినోదానికి రవ్వంత సందేశాన్ని జోడించి 'లవ్ స్టోరీ బిగిన్స్' పేరుతో రూపొందిస్తున్నాం. ఇది ప్రేమ కథా చిత్రాల్లో ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తుంది. ఈ ఏడాదిలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది' అని కథానాయకుడు, నిర్మాత, దర్శకుడు మిథున్ చక్రవర్తి అన్నారు. వర్మ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై మిథున్ సరసన వర్ష-శ్వేత నటిస్తున్నారు. వీరిపై చిత్రీకరించిన 'వస్తావా' అనే గీతాన్ని హైదరాబాద్‌లో ఆవిష్కంచారు. అమర్‌గీత సంగీత సారథ్యంలో శివమణి రాసిన ఈ పాటను, భవదాయిని నాగరాజ్, విద్యుత్ శ్రీనివాస్, థామస్ చిరమేల్ అలెగ్జాండర్ ఆలపించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మిథున్‌చక్రవర్తి మాట్లాడారు.

# గృహిణి నుంచి సీఎంగా ఎదిగిన మహిళ.. ఆసక్తికరంగా టీజర్!




ఓటీటీలో విశేష ప్రేక్షకాదారణ సొంతం చేసుకున్న వెబ్ సిరీస్ 'మహారాణి' బాలీవుడ్ కథానాయిక హ్యూమా ఖురేషీ టైటిల్ పాత్రలో నటించిన ఈ సిరీస్ ఇప్పటికే మూడు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇప్పుడిందులో 'మహారాణి 4' రాబోతుంది. పునీత్ ప్రకాశ్ ఈ వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా 'మహారాణి' సీజన్ 4కు సంబంధించిన టీజర్‌ను విడుదల చేశారు. చదువు రాని ఓ గృహిణి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన రాణి భారతి (హ్యూమా ఖురేషి) జీవిత ప్రయాణాన్ని తెలియజేసే సిరీస్ ఇది. ఈ వ్యవస్థలో ఆమెకు ఎదురైన సవాళ్లు, అధికారంలో ఉన్న ఇబ్బందులు, కుట్రలు, రాజకీయ వైరుధ్యాలు ఇందులో మనం చూడొచ్చు. ప్రేక్షకాదరణ పొందిన గత మూడు సీజన్స్ తరహాలోనే నాలుగో సీజన్ కూడా మరింత గ్రిప్పింగ్ ప్రేక్షకులను మెప్పించనుంది. టీజర్‌ను గమనిస్తే ఎంతో ఆసక్తికరంగా ఉంది. ఎలాంటి భయం లేకుండా ఉండే ముఖ్యమంత్రి రాణి భారతిగా హ్యూమా ఖురేషి తన రాష్ట్ర ప్రజలను కాపాడుకోవటానికి ఎంత దూరమైనా వెళ్లే పవర్‌ఫుల్ పాత్రలో అలరించబోతున్నారు. టీజర్ చాలా గ్రిప్పింగ్‌గా ఉంటూ రానున్న సీజన్ 4పై అంచనాలను మరింతగా పెంచుతోంది. త్వరలోనే ప్రముఖ ఓటీటీ సోనీ లివ్ ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది.